JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | ఆదివారం 28-09-2025
Medchal - Malkajgiri | Sunday 28-09-2025
jayabherinews
సంపుటి : 02 | సంచిక : 123 | పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 123 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com






# ముప్పై ఏళ్ల మహా ప్రళయం

మహానగరాన్ని ప్రకృతి విపత్తు కమ్మేసింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా, చారిత్రక మూసీ నది దాదాపు మూడు దశాబ్దాలలో ఎన్నడూ చూడని విధంగా ఉగ్రరూపం దాల్చింది. జంట జలాశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ (గండిపేట) గేట్లను తెరవడంతో, నగరంలోకి వరద నీరు వేగంగా ప్రవేశించింది. పురానాపూల్ బ్రిడ్జి వద్ద మూసీ నది ఏకంగా 13 అడుగుల ఎత్తులో ప్రవహిస్తుండటం ఈ పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

- ఉగ్రరూపం దాల్చిన మూసీ
- జలదిగ్బంధంలో ఎంజీబీఎస్, అప్రమత్తమైన యంత్రాంగం

జయభేరి, హైదరాబాద్:

ఈ మహా ప్రవాహం కారణంగా నగరంలో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి, దీంతో ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. మూసీ వరద ఉధృతికి మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) పూర్తిగా నీట మునిగింది. దీంతో బస్ స్టాండ్ జలదిగ్బంధంలోకి వెళ్లిపోయింది. శుక్రవారం అర్ధరాత్రి వేళ వరద నీరు ఎంజీబీఎస్ ప్రాంగణంలోకి చేరడంతో, టీజీఎస్ఆర్టీసీ అధికారులు బస్సుల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఎంజీబీఎస్ బస్ స్టేషన్‌కు వెళ్లే రెండు ప్రధాన బ్రిడ్జిలు నీట మునగడం పరిస్థితి తీవ్రంగా మారింది. టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అధికారికంగా ఈ మూసివేతను ప్రకటించారు.వరద ఎంజీబీఎస్‌లోకి చేరిన తక్షణమే, డీఆర్ఎఫ్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన స్పందించారు. డీఎఫ్ఓ యజ్ఞ నారాయణ, ఎస్ఎఫ్ఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, సిబ్బంది తాళ్ల సాయంతో ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటన ఎంజీబీఎస్ చరిత్రలో అరుదైనదిగా నిలిచింది. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా, ఎంజీబీఎస్ నుంచి బయలుదేరే బస్సులను నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి సంస్థ మళ్లించారు. ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ వైపు వెళ్లే సర్వీసులు ...మిగతాది 2 లో

## డ్రోన్ల ద్వారా ఆహార పంపిణీ

హైదరాబాద్, సెప్టెంబర్ 27 :

భారీ వర్షాలతో పాటు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల నుండి నీటిని విడుదల చేస్తుండటంతో మూసీ నది ఉగ్రరూపం దాల్చింది. దీంతో నగరంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. చాదర్‌ఘాట్, పురానాపూల్, ఎంజీబీఎస్, మూసారాంబాగ్ తదితర ప్రాంతాలను వరద ముంచెత్తింది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. దీంతో అధికారులు డ్రోన్ల ద్వారా బాధితులకు ఆహారం, మంచినీరు అందిస్తున్నారు.హైడ్రా, రెవెన్యూ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాయి. హైడ్రా కమిషనర్ రంగనాథ్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.

**మంజీరా నదికి పోటెత్తుతున్న వరద**

సంగారెడ్డి, మెదక్ జిల్లాలను మంజీరా నది వరద వణికిస్తోంది. సింగూరు, మంజీరా బ్యారేజీల నుంచి మంజీరా నదికి భారీ వరద వస్తోంది. మంజీరా ఉగ్రరూపానికి ఏడుపాయల వనదుర్గా ఆలయం గత కొన్ని రోజులుగా వరద నీటిలోనే ఉంటోంది. వరద ధాటికి ఆలయం వద్ద ప్రసాదాల పంపిణీ షెడ్డు కొట్టుకుపోయింది. అమ్మవారి ఆలయానికి వచ్చే దారులన్నీ మూసివేశారు. నదీ పరీవాహక ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో పంట నీట మునిగింది. రైతులు, పశువుల కాపరులు, మత్స్యకారులు నది వైపు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు.

**ముందే హెచ్చరించినా పట్టించుకోలేదు**

భారీ వర్షాలతో హైదరాబాద్ నగరం జల దిగ్బంధంలో చిక్కుకోవడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ...మిగతాది 2 లో


## వరల్డ్ చాంపియన్ గా నిలిచిన భారత పారా ఆర్చర్ శీతల్ దేవి



జయభేరి, న్యూ డిల్లీ, సెప్టెంబర్ 27 :

సాధారణంగా విలు విద్య అంటేనే చేతులతో ప్రదర్శించేది. అలాంటిది చేతులు లేకుండా భారత పారా ఆర్చర్ శీతల్ దేవి వరల్డ్ చాంపియన్ గా నిలిచింది. ప్రపంచ పారా ఆర్చరీ చాంపి సాధారణంగా విలు విద్య అంటేనే చేతులతో ప్రదర్శించేది. అలాంటిది చేతులు లేకుండా భారత పారా ఆర్చర్ శీతల్ దేవి వరల్డ్ చాంపియన్ గా నిలిచింది. ప్రపంచ పారా ఆర్చరీ చాంపియన్ షిప్ లో భాగంగా మహిళల వ్యక్తిగత కాంపౌండ్ కేటగిరిలో సరికొత్త చరిత్ర సృష్టించింది. వరల్డ్ నంబర్ వన్, టర్కీకి చెందిన ఓజ్నుర్ క్యూర్ గిర్డీని 146143 తేడాతో ఓడించి స్వర్ణం గెలుచుకుంది.దక్షిణ కొరియాలోని గ్వాన్ జూ వేదికగా శనివారం జరిగిన పోటిలో శీతల్ దేవి పసిడి గెలించింది. చేతుల్లేకుండానే చాంపియన్ షిప్ లో స్వర్ణం సాధించిన ఆర్చర్ గా శీతల్ చరిత్రకెక్కింది. అంతేకాదు పద్దెమినిదేళ్ల వయసులో శీతల్ దేవి ఈ ఘనత సాధించింది. అంతకు ముందు.. తోమన్ కుమార్‌తో కలిసి మిక్స్‌డ్ టీమ్ విభాగంలో శీతల్ దేవీ కాంస్యం గెలుచుకుంది. మరోవైపు మహిళల ఓపెన్ టీమ్ ఈవెంట్లో సరితతో కలిసి ఆమె రజత పతాకంతో సరిపెట్టుకుంది. ...మిగతాది 2 లో

## దశమి నాటికి అమరావతి సర్కార్ భవనం ఓపెనింగ్



- 6 ఎకరాలు... 160 కోట్లు..!

జయభేరి, విజయవాడ, సెప్టెంబర్ 27:

ఎట్టకేలకు అమరావతిలో తొలి బిల్డింగ్ రెడీ అయింది. ఎంతవరకు కార్యకలాపాలు సాగిస్తున్న బిల్డింగ్స్ అన్నీ కూడా తాత్కాలిక రాజధానిలో భాగమే. దీనిపైన కూటమి ప్రభుత్వం ఎప్పటికప్పుడు విమర్శలు ఎదుర్కొంటూ వచ్చింది. రెండోసారి అధికారంలోకి వచ్చాక గత అనుభవాల దృష్ట్యా రాజధాని పనులను వేగవంతం చేసింది. అందులో భాగంగా అమరావతిలో మొట్టమొదటి శాశ్వత కార్యాలయం రెడీ అయింది. అమరావతి పనులను సమీక్షించే సీఆర్డీఏ కార్యాలయ భవనంగా సీడ్ యాక్సిస్ రోడ్ లో రాయపూడి వద్ద సీఆర్డీఏ బిల్డింగ్ ని గ్రాండ్ గా కట్టారు బిల్డింగ్‌ని G+7 మోడల్లో కట్టారు. బిల్డింగ్ ని బయటి నుంచి చూసే వాళ్లకు అమరావతి ని గుర్తు చేసేలా "A" అనే అక్షరం కనిపించేలా డిజైన్ చేశారు.దీనిలో మొదటి అంతస్తులో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ యూనిట్ ఉంటుంది. ఇక్కడి నుంచే అమరావతి రాజధాని పనుల సమీక్ష, పొల్యూషన్ కంట్రోల్, వర్షపు నీటిని పంప్ చేయడం వంటి పనులను సూపర్వైజ్ చేస్తుంటారు. ...మిగతాది 2 లో

## తెలంగాణ దేశానికి ఒక మోడల్



కొత్తగా గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికైన యువతీ యువకులు తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. “తెలంగాణ భవిష్యత్ నిర్మాణ బాధ్యత మీ చేతుల్లో ఉంది. ఒక బాధ్యతతో వ్యవహరించండి. మనమంతా కలిసి తెలంగాణను దేశానికి ఒక మోడల్‌గా నిలబెడదాం” అని దిశానిర్దేశం చేశారు.

జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 27:

హైదరాబాద్ శిల్పకళా వేదికలో ప్రజా పాలన కొలువుల పండుగలో భాగంగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్ 1లో ఎంపికైన 562 మంది అభ్యర్థులకు ముఖ్యమంత్రి నియామక పత్రాలను అందించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి, ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు, వారి తల్లిదండ్రులకు శుభాభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... "గ్రూప్ 1 కు ఎంపికైన అభ్యర్థుల భుజాలపై తెలంగాణ భవిష్యత్తు పునర్నిర్మాణ బాధ్యత ఉంది. ఇదొక గొప్ప అవకాశం. బాధ్యతతో వ్యవహరించి నియామకాలు చేపట్టాం. ప్రభుత్వం ఒక గొప్ప లక్ష్యంతో ముందుకు వెళుతోంది. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలన్న లక్ష్య సాధనలో మీ వంతు పాత్ర పోషించాలి. గుజరాత్ మాడల్ అనో, ఇంకేదో అనో కాదు. మన పోటీ దేశంతోనే కాదు. ప్రపంచంతో పోటీ పడే విధంగా తెలంగాణను తీర్చిదిద్దాలి. అందుకు కంకణబద్దులై పనిచేయండి. ...మిగతాది 2 లో



## తెలంగాణలో 23 మంది ఐపీఎస్‌ల బదిలీలు

జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 27:

తెలంగాణ రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో ప్రభుత్వం ఒక పెను మార్పునకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో అత్యంత కీలకమైన పోలీస్ వ్యవస్థతో సహా ముఖ్య విభాగాలకు చెందిన 23 మంది ఐపీఎస్ అధికారులను తక్షణమే బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మార్పుతో రాష్ట్ర హోంశాఖ, పౌర సరఫరాల శాఖ, ఆర్టీసీ వంటి ప్రధాన శాఖల్లో కొత్త సారథులు బాధ్యతలు చేపట్టనున్నారు.ఈ బదిలీల పరంపరలో అత్యంత కీలకమైన నియామకం, మీడియా వర్గాలతోపాటు, ప్రజల దృష్టిని ఆకర్షించింది. అదే హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ (సీపీ) పోస్టు. రాష్ట్ర రాజధాని, టెక్నాలజీ హబ్ అయిన హైదరాబాద్‌లో శాంతిభద్రతలను పర్యవేక్షించే అత్యున్నత బాధ్యతను సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలు, సైబర్ క్రైమ్స్, ట్రాఫిక్ నిర్వహణ, ముఖ్యంగా ముఖ్యమంత్రి, రాష్ట్ర స్థాయి ప్రముఖుల ...మిగతాది 2 లో

## ట్రంప్ ను లైట్ గా తీసుకుంటున్న దేశాలు

- ఐక్యరాజ్యసమితి (యూఎన్) జనరల్ అసెంబ్లీలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రసంగం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది


2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి


## తెలంగాణ దేశానికి ఒక మోడల్

ఉద్యోగంలో చేరిన కొత్తలో గరం, గరంగా ఉండి, తర్వాత నరం, నరంగా మారి క్రమేణా బేషరంగా మారుతారన్న నానుడి తప్పు అని నిరూపించే బాధ్యత మీపై ఉంది. ఒక నిరుపేద, నిస్సహాయుడు మీవద్దకు వచ్చినప్పుడు వారికి సేవ చేసే విషయంలో మీ తల్లిదండ్రులు గుర్తుకు రావాలి. మీరంతా నిన్నటి వరకు నిరుద్యోగ యువకులు. ఈ రోజు నుంచి ఆఫీసర్లు. అఫీసర్లకు ఎంతో బలం ఉంది. మీ భవిష్యత్తుకు అది గ్రీన్ చానెల్. మీ భవిష్యత్తును తీర్చిదిద్దాలని రూపాయి, రూపాయి కూడబెట్టి మీకోసం సర్వం త్యాగం చేసిన మీ తల్లిదండ్రులను బాగా చూసుకోవాలి. ఉద్యోగులెవరైనా తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే వారి జీతాల్లో 10 శాతం కోత పెట్టి తల్లిదండ్రుల ఖాతాల్లో వేసే చట్టం తెస్తాం. గ్రూప్ 1 ఉద్యోగం సాధించడానికి 3 లక్షలకుపైగా అభ్యర్థులు పోటీ పడితే అందులో 562 మంది ఎంపికయ్యారు. మీలో ఉన్న నైపుణం, చైతన్యం, పట్టుదల కారణంగా మీరు తెలంగాణ అభివృద్ధికి భాగస్వామ్యులయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో 2011 లో గ్రూప్ 1 నిర్వహిస్తే ఆ తర్వాత గత ప్రభుత్వం గ్రూప్ 1 నిర్వహించాలన్న ఆలోచన చేయలేదు. ఏ ఆకాంక్ష కోసం తెలంగాణ ఏర్పాటు చేసుకున్నామో, గడిచిన పదేండ్లలో ఆ ఆకాంక్ష నెరవేరలేదు. తెలంగాణ కోసం ఎంతో మంది ప్రాణ త్యాగం వల్ల సాధించిన తెలంగాణ ఒక కుటుంబ ప్రయోజనం కోసం కాదు. పెద్ద పెద్ద ఉద్యోగాలను నియమించే పబ్లిక్ సర్వీస్ కమిషన్ చిన్న చిన్న హోదాల్లో ఉన్న వారిని నియమించడమే కాకుండా ఆ రోజు ప్రశ్నాపత్రాలు పల్లీబఠాణీలుగా జిరాక్స్ సెంటర్లలో లభించే విధంగా పోటీ పరీక్షలను అపహాస్యం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను యూపీఎస్సీ కన్నా ఉన్నతంగా ఉంచాలని కమిషన్‌ను ప్రక్షాళన చేశాం. అది నచ్చని కొంతమంది కడుపుమంటతో చేయని ప్రయత్నాలు లేవు. ఉద్యోగాలను అమ్ముకున్నారని అపవాదు వేశారు. నేను, మంత్రివర్గ సహచరులం మంచి చేయాలన్న ఒక సంకల్పంతో పనిచేశాం. ఆరోపణలు చేసినప్పటికీ ఓపికతో దిగమింగుకున్నాం. డిసెంబర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సమయంలో కూడా అంత ఆందోళన చెందలేదు. కానీ గ్రూప్ 1 కోసం ఆందోళన చెందా. ఒక మంచి సంకల్పంతో పని చేసినప్పుడు లక్ష్యం ముందుండాలి తప్ప మరొకటి కాదు" అని ఉద్ఘాటించారు.

## దశమి నాటికి అమరావతి సర్కార్ భవనం ఓపెనింగ్

రెండు మూడు నాలుగు అంతస్తులను సీఆర్డీఏ సిబ్బంది, అధికారులు వాడుకుంటారు. 5,6 అంతస్తులను అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ తన కార్యాలయంగా వాడుకోబోతుంది. అమరావతిలో ఎలాంటి సంస్థలు రావాలి, రాజధాని అభివృద్ధి వంటి అంశాలను ఈ సంస్థ మానిటరింగ్ చేస్తుంది. ఇక ఏడో అంతస్తులో మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ మినిస్టర్ కార్యాలయం ఉంటుంది. ప్రస్తుతం ఆ శాఖకు మంత్రి నారాయణ. పూర్తిస్థాయిలో రాజధాని నిర్మాణం, అభివృద్ధి పనులు ఆయన ఆధ్వర్యంలో జరుగుతున్నాయి కాబట్టి ఆయన కార్యాలయం కూడా బిల్డింగ్ లోనే ఉండాలని ముఖ్యమంత్రి సూచించడంతో తన ఆఫీసు కూడా ఇక్కడే ఏర్పాటు చేసుకున్నారు. ఈ బిల్డింగ్ టెర్రస్ పై ఉద్యోగుల కోసం జిమ్, కేఫ్ వంటి ఏర్పాట్లు చేసారు. అమరావతి రాజధానిలో మొట్టమొదటి బిల్డింగ్ గా నిలిచిపోయే సీఆర్డీఏ భవంతిని వరల్డ్ క్లాస్ టెక్నాలజీ తో నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్ లో పూర్తిగా మోడరన్ గా ఉండే రిసెప్షన్, బిల్డింగ్ పైకి వెళ్లడానికి ఐదు లిఫ్టులు, ఫైర్ ఎగ్జిట్, వృత్తాకారంలో ఉండే స్టెప్స్, సెంట్రలైజ్డ్ ఏసి, ఎటు చూసినా అద్భుతంగా వెలుగుతూ ఉండే లైట్స్ లాంటి ఏర్పాట్లు దీనిలో ఉన్నాయి. నిజానికి ఈ బిల్డింగ్ నిర్మాణం కోసం 201419 కాలంలోనే అప్పటి కూటమి ప్రభుత్వం ప్లాన్ రెడీ చేసింది. కానీ మధ్యలో ప్రభుత్వం మారడం, అమరావతి పనులు వెనక పడడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇప్పుడు కూటమి మళ్ళీ అధికారం లోకి రావడంతో బిల్డింగ్ నిర్మాణాన్నీ వేగంగా పూర్తి చేశారు. దీనికోసం 6 ఎకరాలు కేటాయించగా దానిలో 3.62 ఎకరాల్లో బిల్డింగ్ ఉండబోతోంది. మిగిలిన 2.51 ఎకరాల్లో పార్కింగ్, గ్రీనరీ ఏర్పాట్లు చేశారు. బిల్డింగ్ నిర్మాణం కోసం టెండర్లు పిలిచినప్పుడు 160 కోట్లతో కేపీసీ సంస్థ ఈ ప్రాజెక్టును చేజిక్కించుకుంది. నిజానికి ఈ బిల్డింగ్ ప్రారంభోత్సవం ఎప్పుడో జరిగిపోయి ఉండాల్సింది. అయితే వర్షాల కారణంగా బ్యూటిఫికేషన్ పనులు లేట్ అయ్యాయి. వీలైనంత త్వరగా ఈ పనులు పూర్తి చేసి అక్టోబర్ 2న గాని లేదా అదే నెలలో మరో తేదీని గాని తేదీన గానీ బిల్డింగ్ ని ప్రారంభించబోతుంది కూటమి ప్రభుత్వం.

## తెలంగాణలో 23 మంది ఐపీఎస్‌ల బదిలీలు



భద్రతను పర్యవేక్షించే ఈ కీలక స్థానంలో సజ్జనార్ నియామకం రాష్ట్ర పోలీసు యంత్రాంగానికి కొత్త శక్తిని ఇవ్వనుంది.

**హోంశాఖకు సీవీ ఆనంద్**

రాష్ట్ర హోంశాఖ పరిపాలనా వ్యవహారాల్లో పటిష్టతను తీసుకురావడానికి ప్రభుత్వం అత్యంత కీలకమైన మరో నిర్ణయం తీసుకుంది. హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సీవీ ఆనంద్‌ను నియమించింది. పోలీస్ బలగాల నిర్వహణ, ఆస్తులు, మౌలిక సదుపాయాలు, రక్షణ సంబంధిత విధాన నిర్ణయాలు హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఉంటాయి.సీవీ ఆనంద్ నియామకం ద్వారా, రాష్ట్ర పోలీస్ వ్యవస్థకు చెందిన సీనియర్ అధికారి, పరిపాలనా విభాగాన్ని పర్యవేక్షించడం వలన, లా అండ్ ఆర్డర్ విభాగాలు, పరిపాలన మధ్య సమన్వయం మరింత మెరుగుపడే అవకాశం ఉంది. ఈ నియామకం ద్వారా పాలనలో వేగం, నిర్ణయాల్లో స్పష్టత పెరుగుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

**ఇంటెలిజెన్స్ డీజీగా విజయ్ కుమార్**

ఏదైనా రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణకు, ప్రభుత్వాన్ని రక్షించడానికి మూలస్తంభంలా పనిచేసే విభాగం ఇంటెలిజెన్స్ . కీలకమైన సమాచారాన్ని సేకరించడం, ఉగ్రవాద బెదిరింపులను, అంతర్గత భద్రతా సమస్యలను ముందుగానే పసిగట్టడం ఈ విభాగం బాధ్యత. ప్రభుత్వం ఇంటెలిజెన్స్ డీజీగా విజయ్ కుమార్‌ను నియమించడం ద్వారా, రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన ముందస్తు వ్యూహాలను పటిష్టం చేయడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఒక కీలక సమయంలో, అత్యంత నమ్మకస్తుడైన, అనుభవజ్ఞుడైన అధికారికి ఈ బాధ్యతలు అప్పగించడం వ్యూహాత్మక చర్యగా చెప్పవచ్చు.ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో, అవినీతి నిరోధక శాఖలో (ఏసీబీ) కూడా సమర్థులైన అధికారులను నియమించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా శిఖా గోయల్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రభుత్వ పథకాల అమలులో లోపాలు, అవకతవకలను గుర్తించడంలో ఈ విభాగం కీలక పాత్ర పోషిస్తుంది. శిఖా గోయల్ నియామకం ద్వారా విజిలెన్స్ విభాగానికి కొత్త దిశానిర్దేశం లభించనుంది.అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) విషయానికి వస్తే, ప్రస్తుతం సీఐడీ అదనపు డీజీగా ఉన్న చారుసిన్హాకు ఏసీబీ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఒక సీనియర్ అధికారి అదనపు బాధ్యతలు స్వీకరించడం వలన, ఏసీబీ విచారణల్లో సమగ్రత, పారదర్శకత పెరుగుతాయని అంచనా. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీజీగా స్వాతిలక్రాకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

1. ఆర్టీసీ ఎండీగా నాగిరెడ్డి నియమితులయ్యారు. ఆర్టీసీ ఆర్థిక స్థిరత్వం, ప్రజలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడం నాగిరెడ్డి ముందున్న ముఖ్య లక్ష్యాలుగా ఉన్నాయి.ఇప్పటి వరకు ఈ విభాగంలో సజ్జనార్ తన మార్క్ చూపించారు. దాన్ని కొనసాగిస్తా లేదంటే ప్రత్యేక స్టైల్‌ను అనుసరిస్తారా అనే ఆసక్తి ఉంది.
2. పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రటరీగా స్టీఫెన్ రవీంద్రను నియమించారు. ఆహార భద్రత, రేషన్ పంపిణీ వంటి అత్యంత సున్నితమైన, ప్రజలతో ప్రత్యక్ష సంబంధం ఉన్న ఈ శాఖ బాధ్యతలను స్టీఫెన్ రవీంద్రకు అప్పగించడం ద్వారా, పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంచాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

మొత్తం 23 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఈ ఉత్తర్వులు, కేవలం అధికారుల మార్పులు మాత్రమే కాదు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ, ముఖ్య పాలనా విభాగాలకు సమర్థత, అనుభవం కలిగిన అధికారులను నియమించడం ద్వారా, పాలనా యంత్రాంగాన్ని మరింత దృఢంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పం ఇందులో కనిపిస్తోంది.

# ముప్పై ఏళ్ల మహా ప్రళయం

▶▶ మొదటిపేజీ తరువాయి

జేబీఎస్ నుంచి నడుస్తున్నాయి. వరంగల్, హన్మకొండ వైపు వెళ్లేవి ఉప్పల్ క్రాస్ రోడ్స్ నుంచి, సూర్యాపేట, నల్గొండ, విజయవాడ వైపు వెళ్లేవి ఎల్బీనగర్ నుంచి, మహబూబ్‌నగర్, కర్నూల్, బెంగళూరు వైపు వెళ్లేవి ఆరాంఘర్ నుంచి తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నాయి. ప్రయాణికులు ఎంజీబీఎస్‌కు రావొద్దని టీజీఎస్ఆర్టీసీ విజ్ఞప్తి చేసింది.

**ప్రాణాల కాపాడిన రెస్క్యూ బృందాలు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్ విభాగాల అధికారులు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న 1000 మందికి పైగా ప్రజలను అధికారులు తాత్కాలిక పునరావాస కేంద్రాలకు తరలించారు.

- పురానాపూల్ శివాలయంలో వరద నీటిలో చిక్కుకుపోయిన నలుగురు ఆలయ సిబ్బందిని కాపాడేందుకు హైడ్రా డీఆర్ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగారు. నీటి ప్రవాహం పెరగడంతో ఆపరేషన్‌కు అంతరాయం ఏర్పడింది. శివాలయం పైనే పూజారి కుటుంబం ఉండిపోగా, వారికి టిఫిన్స్ భోజనాలు అందించారు.
- ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) సర్వీస్ రోడ్డుపై కూడా వరద బీభత్సం కనిపించింది. ఉస్మాన్ సాగర్ గేట్లు ఎత్తడంతో నార్సింగి - మంచిరేవుల మధ్య సర్వీసు రోడ్డుపై వరద పారింది. బారికేడ్లు పెట్టినా పట్టించుకోకుండా ఆటో ట్రాలీలో రోడ్డు దాటేందుకు ప్రయత్నించిన డ్రైవర్, అందులోని నలుగురిని హైడ్రా DRF బృందాలు రాత్రివేళ సురక్షితంగా కాపాడాయి.
- చాదర్‌ఘాట్ వంతెన వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చిన్న బ్రిడ్జి మూసివేయడంతో, పెద్ద బ్రిడ్జి పైనుంచి వాహనాలు రాకపోకలు కొనసాగించాయి. అంబర్‌పేట్ - దిల్‌సుఖ్‌నగర్ రహదారి పూర్తిగా మూసివేశారు.

**పునరావాస కేంద్రాల్లో బాధితులు**

- వరద ప్రభావిత ప్రాంతాల్లోని కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, పునరావాస కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, హైదరాబాద్ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ముంపుకు గురైన కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు వెల్లడించారు.

**పునరావాస కేంద్రాల వివరాలు:**

- శంకర్ నగర్ ప్రాంతంలోని దాదాపు 500 మంది నిర్వాసితులు షాజాదీ మసీదులో వసతి పొందుతున్నారు.
- మలక్‌పేట్ సర్కిల్‌లోని మూసానగర్ కమ్యూనిటీ హాల్ లో 150 మంది వసతి పొందుతున్నారు.
- దుర్గా నగర్, అంబేద్కర్ నగర్ నిర్వాసితులు (దాదాపు 45 కుటుంబాలు) మూసారాంబాగ్ వంతెనకు సమీపంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వసతి పొందుతున్నారు.
- కృష్ణ నగర్ కమ్యూనిటీ హాల్‌కు 32 మందిని తరలించి ఆహారపదార్థాలు అందిస్తున్నారు.
- భూ లక్ష్మీ ఆలయం నుంచి 55 మందిని గోడేకి ఖబర్ కమ్యూనిటీ హాల్‌కు తరలించారు.
- ఈ కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బతుకమ్మ, దసరా పండుగలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది.



### డ్రోన్ల ద్వారా ఆహార పంపిణీ

ఇది ప్రభుత్వ వైఫల్యం కాదని, నేరపూరిత నిర్లక్ష్యమని ఆయన ఘాటుగా విమర్శించారు. వాతావరణ శాఖ ముందుగానే తీవ్ర వర్షాలు కురుస్తాయని హెచ్చరించినా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం అప్రమత్తంగా వ్యవహరించలేదని ఆయన మండిపడ్డారు.వరద తీవ్రతను అంచనా వేయడంలో, ప్రణాళికలు రచించడంలో, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం సాధించడంలో సర్కారు పూర్తిగా విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రభుత్వ యంత్రాంగం ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ ముందుచూపు లోపం వల్లే పండుగ వేళ ఊళ్లకు వెళ్లే ప్రయాణికులు ఎంజీబీఎస్ బస్టాండులో వరద నీటిలో చిక్కుకుని రాత్రంతా భయంతో గడపాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.మూసీ నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో పరీవాహక ప్రాంతాల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఇలాంటి క్లిష్ట సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బురద రాజకీయాలను కాసేపు పక్కనపెట్టి, సహాయక చర్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. వరదల్లో చిక్కుకున్న ప్రయాణికులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు.మూసీ పరిసర ప్రాంతాల్లో ముంపునకు గురయ్యే ప్రజలను గుర్తించి, వారికి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలించి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు.

**మంజీరా, గోదావరి హెచ్చరికలు**

- మంజీరా నది మహోగ్రరూపం దాల్చింది. ఏడుపాయల ఆలయం వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది, వరద ఆలయం పైకప్పును తాకుతోంది. దీంతో ఆలయం వద్దకు ఎవరూ రావొద్దని హెచ్చరికలు జారీ చేశారు. వరద ఉధృతికి ప్రసాదాల పంపిణీ షెడ్డు కొట్టుకుపోయింది. మంజీరా బ్యారేజీకి భారీగా వరద నీరు చేరడంతో 1.20 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.
- భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 46.60 అడుగులకు చేరింది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. నీటిమట్టం 48 అడుగులకు చేరితే రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.
- యాదాద్రి జిల్లాలో కూడా మూసీ ఆగ్రహం కనిపించింది. జూలూరు - రుద్రవెల్లి వద్ద వంతెనపైగానే వరద ప్రవహించడంతో పోచంపల్లి - బీబీనగర్ రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

ప్రాణ నష్టం జరగకుండా అధికారులు హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నారు. మూసీ ఒడ్డునకు, వంతెనలకు దగ్గరగా వెళ్లవద్దని అధికారులు ప్రజలను విజ్ఞప్తి చేశారు. అయితే, కొంతమంది ప్రజలు పురానాపూల్, నయాపూల్ బ్రిడ్జిల నుంచి వరద నీటిని చూసి ఆశ్చర్యానికి లోనవడం, సెల్ ఫోన్లలో వీడియోలు తీసుకోవడం, సెల్ఫీలు దిగడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. అటువంటి ప్రమాదకర చర్యల పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు, పురానాపూల్ బ్రిడ్జి పైన చిరు వ్యాపారులను కూడా పోలీసులు అనుమతించడం లేదు.వాతావరణ శాఖ రాబోయే 24 గంటల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. దీనికి తోడు, మూసీ కాలుష్యం, ముఖ్యంగా అతిక్రమణల వల్ల నది నీటి పారుదల సామర్థ్యం తగ్గిందనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ వరదలపై స్పందిస్తూ, వరద బాధితులకు అండగా నిలవాలని తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**మునిగిపోయిన ఇమ్లీబన్**

హైదరాబాద్ మహానగరాన్ని శుక్రవారం రాత్రి భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. కుండపోత వానకు నగరం అస్తవ్యస్తంగా మారింది. జంట జలాశయాల గేట్లు ఎత్తడంతో మూసీనది ఉగ్రరూపం దాల్చి, మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) ప్రాంగణాన్ని పూర్తిగా ముంచెత్తింది. వందలాది మంది ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు, పిల్లలు గంటల తరబడి బస్టాండ్‌లోనే చిక్కుకుపోయి తీవ్ర భయాందోళనలకు, ఇబ్బందులకు గురయ్యారు. మూసీ ప్రవాహం అర్ధరాత్రి తర్వాత ఒక్కసారిగా పెరిగి, గండిపేట నుంచి నాగోల్ వరకు నది ప్రమాదకర స్థాయిలో ప్రవహించింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించారు. అర్ధరాత్రి సమయంలోనే ఉన్నత అధికారులతో సమీక్ష నిర్వహించి, బస్టాండ్‌లో చిక్కుకున్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకురావాలని పోలీసు, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# ట్రంప్ ను లైట్ గా తీసుకుంటున్న దేశాలు



**✍ జయభేరి, న్యూయార్క్, సెప్టెంబర్ 27:**

ఐక్యరాజ్యసమితి (యూఎన్) జనరల్ అసెంబ్లీలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రసంగం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. 2025 సెప్టెంబర్ 23న జరిగిన ఈ ప్రసంగంలో ట్రంప్ తన దేశ జాతీయత, స్వయం సమృద్ధి, ఇతర దేశాల విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇది అంతర్జాతీయ సహకారానికి సవాలుగా మారింది, ఎందుకంటే ప్రపంచ నాయకులు ఈ ప్రస్తావనలకు మౌనంగా లేదా వ్యతిరేకంగా స్పందించారు. ఈ ప్రసంగం ట్రంప్ 'అమెరికా ఫస్ట్' విధానాన్ని మరింత బలపరిచింది, కానీ ఇది గ్లోబల్ ఎకానమీ, డిప్లొమసీలో కొత్త ఉద్రిక్తతలను రేకెత్తించింది.ట్రంప్ 2018లో ప్రస్తావనలకు నవ్వులు వినిపించినప్పటికీ, 2025లో దళారులు మాత్రమే కనిపించాయి. ట్రంప్ తన ప్రసంగాన్ని మొదలుపెట్టేటప్పుడే టెలిప్రాంప్టర్, ఎస్కలేటర్ సమస్యలు తలెత్తాయి. వాటిగురించి జోక్ చెప్పి కొంత హాస్యాన్ని రేకెత్తించారు. అయితే, తర్వాత అతి తీవ్రమైన భాగాల్లో - యూరప్ మైగ్రేషన్ విధానాలు 'ఓపెన్ బోర్డర్స్ ఎక్స్‌పెరిమెంట్'గా విమర్శించడం, క్లైమేట్ చేంజ్ ప్రెడిక్షన్లను 'స్టూపిడ్ పీపుల్' చేసినవిగా తప్పుబట్టడం - డెలిగేట్లు మౌనంగా కూర్చున్నారు. బాడీ లాంగ్వేజ్ నిపుణుల ప్రకారం, ఈ మౌనం ట్రంప్‌ను తీవ్రంగా తీసుకోవడానికి మరింత ప్రాముఖ్యత ఇచ్చింది, కానీ అదే సమయంలో అసౌకర్యాన్ని కూడా వ్యక్తం చేసింది. ట్రంప్ తన పాలనలో 'సెవెన్ వార్స్'లను ఆపేశానని ప్రకటించారు. యూఎన్ సహాయం లేకుండానే అని వాదించారు. ఇది యూఎన్‌ను 'ఫెక్లెస్' సంస్థగా చిత్రీకరించింది. యూరోపియన్ లీడర్లు, ముఖ్యంగా ఫ్రెంచ్ అధ్యక్షుడు ఎమ్మాన్యువల్ మాక్రాన్, ఈ విమర్శలకు 'ఎక్స్‌సెసివ్' అని స్పందించారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు క్లైమేట్ క్రైసిస్‌ను 'గ్లోబల్ థ్రెట్'గా పేర్కొన్నారు. ఈ స్పందనలు ట్రంప్ విధానాలు అంతర్జాతీయ సమూహాల్లో ఎంతో దూరంగా ఉన్నాయో చూపించాయి. ఫలితంగా యూఎన్ వేదిక ట్రంప్‌కు సవాలు విసిరే ప్లాట్‌ఫారమ్‌గా మారింది. ఇతర నాయకులు సహకారం కంటే వ్యతిరేకతను చూపించారు.ట్రంప్ ప్రసంగం తర్వాత, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ట్రంప్ విమర్శలకు సూక్ష్మంగా స్పందిస్తూ, ఆయన గ్లోబల్ ఎథిక్స్, సమానత్వం, గౌరవం అవసరాన్ని బలపరిచారు. ప్రపంచ నాయకులు తమ అధికారాన్ని స్వయం గౌరవం కోసం కాకుండా, ప్రజల సేవకు ఉపయోగించాలని రిప్లర్‌గా చెప్పారు. ఇది ట్రంప్ వంటి 'నేషనలిస్ట్' విధానాలకు పరోక్ష విమర్శగా మారింది. సామాజిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని దిశానిర్దేశం చేసింది. ఈ ప్రసంగం ముస్లిం దేశాల లీడర్ల మధ్య ఒక కొత్త అలయన్స్‌ను సూచించింది. టర్కీ అధ్యక్షుడు రెజెప్ తైయిప్ ఎర్డోగాన్‌తో కలిసి, ఇది ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా ఒక యూనైటెడ్ ఫ్రంట్‌ను ఏర్పరచడానికి దారితీసింది. ప్రబోవో ప్రసంగం యూఎన్ విలువలను పునరుద్ధరించడానికి ప్రేరణగా నిలిచింది, ప్రపంచంలో సహకారం, సమానత్వం లేకుండా శాంతి సాధ్యం కాదని హైలైట్ చేసింది.ఈ యూఎన్ సమ్మిట్ సందర్భంగా, భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం భారత-అమెరికా సంబంధాలు, దేశాభివృద్ధి చర్యలపై దృష్టిసారించింది. మోదీ పాలనలో ఆర్థిక రంగ అభివృద్ధి, 'మేక్ ఇన్ ఇండియా' వంటి కార్మిక విధానాలు, గవర్నమెంట్ డిప్లొమసీని ప్రశంసించారు. భారతదేశం తన అనుగుణ ఆర్థిక మార్పుల ద్వారా ప్రపంచంలో ఎదుగుతున్నట్లు చెప్పారు. అయితే, ట్రంప్ విధానాలు ఈ సంబంధాలకు సవాలు విసిరాయిమోదీ-ట్రంప్ మధ్య మునుపటి 'బ్రోమాన్స్' ఇప్పుడు టారిఫ్ వివాదాలతో దెబ్బతిన్నది. 2025 జులైలో ట్రంప్ భారత ఎగుమతులపై 25% టారిఫ్ విధించారు, ఇది రష్యన్ ఆయిల్ కొనుగోళ్లు, యూఎస్ గూడ్స్‌పై భారత టారిఫ్‌ల కారణంగా 50%కి పెరిగింది. ఇది భారత జీడీపీకి 0.8% దెబ్బ తీస్తుందని అంచనా. మోదీ 'హెవీ ప్రైస్' చెల్లిస్తానని చెప్పి, ఫార్మర్స్, డెయిరీ సెక్టార్లను రక్షించాలని నిర్ణయించారు. అమెరికా-భారత వ్యాపారం 500 బిలియన్ డాలర్ల లక్ష్యంతో ముందుకు సాగుతున్నప్పటికీ, ఈ టారిఫ్‌లు ఎగుమతులను ప్రభావితం చేస్తాయి. భారత్ హెచ్-1బీ వీసాలపై కూడా ఒత్తిడి ఎదుర్కొంటోంది. మోదీ ప్రసంగంలో ఈ సవాళ్లను ఎదుర్కొని, భారత్ స్వయం సమృద్ధికి దృష్టి పెట్టాలని సూచించారు. ఇది భారత ఆర్థిక విధానాల్లో మార్పులకు దారితీస్తోంది.యూఎన్ సమ్మిట్ సందర్భంగా, ప్రపంచ దేశాల మధ్య అధికార మార్పులు, టారిఫ్ విధానాలు చర్చనీయాంశాలుగా మారాయి. భారత్ జియోపాలిటిక్స్‌లో ఎదుగుతున్నది, చైనా-రష్యా సంబంధాల మధ్య సమతుల్యత పాటిస్తూ యూఎన్, అమెరికాతో అనుసంధానం చేసుకుంటోంది. ట్రంప్ టారిఫ్‌లు భారత్‌ను రష్యా, చైనాతో దగ్గర చేయడానికి దోహదపడతాయి.జియోపాలిటిక్స్‌లో భారత్ అమెరికా-ఐరోపా అలయన్స్‌లలో చేరాలని ప్రయత్నిస్తోంది, కానీ రష్యన్ ఆయిల్ కొనుగోళ్లు కారణంగా టెన్షన్లు పెరుగుతున్నాయి. యూఎన్‌లో మోదీ ప్రసంగం గాజా, ఉక్రెయిన్ వివాదాల్లో భారత్ 'మల్టీ-అలైన్‌మెంట్' విధానాన్ని హైలైట్ చేసింది. టారిఫ్‌లు దేశాల మధ్య వ్యాపార రాజకీయాల్లో మార్పులు తీసుకొస్తున్నాయి - భారత్ బంగ్లాదేశ్, వియత్నాం వంటి దేశాలతో పోటీ పడాల్సి వస్తోంది. భవిష్యత్తులో, భారత్ యూరప్, ఇతర ఆసియా దేశాలతో ట్రేడ్ డీల్స్ పెంచి, ఈ సవాళ్లను ఎదుర్కొనాలి. యూఎన్ సమ్మిట్ ప్రపంచ రాజకీయాల్లో కొత్త డైనమిక్స్‌ను చూపించింది.

# అత్యంత వైభవంగా సద్దుల బతుకమ్మ

**జయభేరి, ఘట్కేసర్ :**



సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా ఘట్కేసర్ మున్సిపల్ పరిధి పలు వార్డులో పట్టణ మహిళలతో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఘట్కేసర్ మున్సిపల్ మాజీ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్. ఈ సందర్భంగా మాజీ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ అంటే బతుకమ్మ. బతుకమ్మ అంటే తెలంగాణ. బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్ర సంస్కృతీ సంప్రదాయలకు, ఆచారాలకు ప్రతీక. అందమైన ప్రకృతిని ఆరాధిస్తూ.. పుడమి తల్లి విశిష్టతను కీర్తిస్తూ ఆనందంతో మురిసిపోయే క్షణాలకు వేదిక ఈ బతుకమ్మ పండుగ. తెలంగాణ అస్తిత్వానికి.. సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిబింబంగా భావించే బతుకమ్మ పండుగ 9 రోజుల పాటు జరుగుతుంది. బతుకమ్మ సంబరాలు ప్రతియేటా మహాలయ అమావాస్య రోజున ఎంగిపూల బతుకమ్మతో మొదలై.. సద్దుల బతుకమ్మతో ముగుస్తాయని. బతుకమ్మపై ఉంచిన గౌరమ్మను మహిళలు తమ మంగళ సూత్రానికి పెట్టుకుంటారు. అయితే చివరి రోజు సద్దుల బతుకమ్మ అని పిలుస్తారు. ఆరోజున దూర ప్రాంతాల్లోని అక్క చెల్లెళ్లు, అన్నదమ్ములు, వదినా మరదళ్లు, చిన్నారులు, బంధువులు అంతా ఒకచోట చేరుతారు. మహిళలంతా కలిసి ఘనంగా బతుకమ్మ ఆడతారు. అనంతరం దగ్గర్లోని చెరువలో లేదా కుంటలో బతుకమ్మను నిమజ్జనం చేస్తారు. ఇందులో భాగంగా మక్క సత్తును ప్రసాదంగా అందరికీ పంచి పెడతారు. ప్రకృతి సౌందర్యమైన పూలనే గౌరీ దేవి అమ్మవారిగా కొలుస్తూ ఈ బతుకమ్మ పండుగ వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకుంటారు. మరోవైపు బతుకమ్మ పైభాగంలో ఉంచిన గౌరమ్మను మహిళలు తమ మంగళ సూత్రానికి పెట్టుకుంటారని మరొకసారి తెలిపారు. ఈ కార్యక్రమం లో మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



## లలిత త్రిపుర సుందరి దేవిగా అమ్మవారి అలంకరణ

**జయభేరి, తుర్కపల్లి, సెప్టెంబర్ 27:**

తుర్కపల్లి మండలం పల్లె పహాడ్ గ్రామంలో శ్రీ దుర్గాభవాని సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారు 6 వ రోజు లలిత త్రిపుర సుందరీ దేవి గా అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించారు. అమ్మవారికి పెసర గారెలు పులిహోర ను నైవేద్యంగా సమర్పించారు. పూజా కార్యక్రమంలో అన్న ప్రసాద దాతలు మాజీ సర్పంచ్ సొక్కుల లతా మోహన్ రెడ్డి, పూజ లో జూపల్లి రేణుక శ్రీనివాస్ పాంగల ఆశ బాల నరసింహ దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భవాని మాత మాల వేసుకున్న స్వాములు దిలీప్ కుమార్ భవాని, బాల నరసింహ భవాని, బన్నీ భవాని, సాయి భవాని ,శశి కుమార్ భవాని, శ్రవణ్ కుమార్ భవాని, మహాలక్ష్మి మాత వైష్ణవి మాత, ధరణి మాత, భావన మాత, గ్రామస్తులు పాల్గొన్నారు.

## డిఎస్పీగా ఎంపికైన బానోత్ సబిత

- పేదింటి గిరిజన కుటుంబంలో వికసించిన విద్యా కుసుమం



**జయభేరి, తుర్కపల్లి, సెప్టెంబర్ 27:**

తుర్కపల్లి మండలం గొల్లగూడెం రామోజీ తండా కు చెందిన బానోతు సబితా సంతోష్ గ్రూప్ వన్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకు సాధించి ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో డిఎస్పీగా ఎంపికయ్యారు. బానోతు సబిత గ్రూప్ వన్ లో 303 అత్యుత్తమ ర్యాంకు సాధించారు. భర్త సంతోష్ ప్రోత్సాహం తన మామ రాజపేట మండలం బేగంపేట ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ టీచర్ గా పనిచేస్తున్న బానోత్ రమేష్ నాయక్, అత్త కుటుంబ సభ్యుల సహకారం, గురువుల ప్రోత్సాహం వల్లే గ్రూప్ వన్ లో ఉత్తమ ర్యాంకు సాధించినట్లు బానోతు సబిత తెలిపారు. గిరిజన పేదింటి కుటుంబంలో వెలిగిన విద్యా కుసుమం సబితకు పలువురు అభినందనలు తెలుపుతూ ప్రశంసించారు.

# డీఎస్పీ పంచరు షాపు నడుపుకునే వ్యక్తి కూతురు

**జయభేరి, వరంగల్, సెప్టెంబర్ 27:**



ములుగు జిల్లా జేడీ మల్లంపల్లి గ్రామానికి చెందిన మౌనిక జీవితం చిన్నప్పటి నుంచి కష్టాలతోనే సాగింది. కూలీ పనులు చేసే తల్లి సరోజ, చిన్న పంక్చర్ షాపుతో కుటుంబాన్ని నెట్టుకొచ్చిన తండ్రి సమ్మయ్య.. ఇద్దరూ ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రమించేవారు. ఆర్థిక పరిస్థితి ఎంత కఠినంగా ఉన్నా.. వారు కూతురు చదువును మాత్రం ఆపలేదు. వారి త్యాగాలు, కలలని చూసి మౌనిక ప్రభుత్వ కొలువు సంపాదించి.. తల్లిదండ్రుల కష్టానికి ప్రతిఫలం ఇవ్వాలని చిన్నప్పుడే నిర్ణయించుకుంది.2020లో డిగ్రీ పూర్తి చేసిన ఆమె.. ఆ తర్వాత పూర్తిగా ఉద్యోగ సాధనపై ఫోకస్ పెట్టింది. కోచింగ్ సెంటర్లకు భారీ ఫీజులు కట్టే పరిస్థితి లేకపోవడంతో.. ఇంట్లోనే తన ప్రిపరేషన్ కొనసాగించింది. గ్రూప్1 పరీక్షల కోసం రోజుకు 12 గంటలకుపైగా క్రమశిక్షణతో చదివింది. క్రమం తప్పకుండా టెస్ట్ పేపర్లు రాసి.. తన తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకు సాగింది. కష్టాలు ఎన్ని వచ్చినా, లక్ష్యాన్ని వదల్లేదు.ఆ పట్టుదల ఫలించింది. తాజాగా విడుదలైన గ్రూప్1 ఫలితాల్లో మౌనిక 315వ ర్యాంక్ సాధించింది.

ఈ ర్యాంక్ ద్వారా ఆమె డీఎస్పీగా ఎంపికైంది. తల్లిదండ్రులు ఒకప్పుడు చెమటోడ్చి నడిపిన పంక్చర్ షాపు ముందు, ఈరోజు డీఎస్పీగా నిలబడ్డ కూతురి విజయాన్ని చూసి వారి కళ్లలో ఆనందభాష్పాలు మెరిశాయి.మౌనిక గెలుపు కేవలం వ్యక్తిగత విజయమే కాదు.. అనేక పేద, మధ్యతరగతి యువతకు స్ఫూర్తి. శ్రమను ఆయుధంగా మార్చుకుంటే విజయమే నీ సొంతం అవుతుంది అని తన జీవితం ద్వారా నిరూపించింది మౌనిక. గ్రామమంతా ఆమెను అభినందిస్తారు. అందరూ గొప్ప కూతుర్ని కన్నారు అంటుంటే మౌనిక తల్లిదండ్రులు మురిసిపోతున్నారు.

# పట్టపగలే పడకేసిన ఆసుపత్రి

- సమయపాలన పాటించని వైద్యులు నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బంది
- సైదాపూర్ మండల ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

**జయభేరి, సైదాపూర్ :**




సైదాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు గాని.. సంబంధిత అధికారులు ఎ.ఎన్.ఎం గాని ఎవ్వరు లేకపోవడంతో అనారోగ్యంతో బాధపడుతున్న రోగి, కోతి కరిసిన వ్యక్తి వైద్య కోసం సైదాపూర్ ఆసుపత్రికి వస్తే.. మధ్యాహ్నం 2:00 గంటలకే గేటుకు తాళం వేసి ఉన్నది. ప్రస్తుతం విషజ్వరాలతో బాధపడుతున్న ప్రజలు మధ్యాహ్న వరకే గేట్లు మూసి వెయ్యటంతో కంగు తిన్న రోగులు..వారి కుటుంబ సభ్యులు మెరుగైన వైద్య సేవలు కోసం హుజురాబాద్ కు పోవడంతో అక్కడ కూడా సరైన వైద్యం అందక.. మండల అధికారి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గతంలో వైద్య సేవల కోసం వెళ్తే ఇదే విధంగా నిర్లక్ష్యం వహించిన సంబంధిత వైద్య అధికారి. ఈ సమస్యకు పూర్తి బాధ్యత సంబంధిత ఈ క్రిష్ణ కుమార్ ఫోన్ నెంబర్ ఇవ్వడం జరిగింది. ఫోన్ చేసిన ఏలాంటి స్పందన లేదు. ఫోన్ ఎత్తటం లేదు, సరైన వైద్యం అందక పోవడంవల్ల ప్రజలు, గ్రామస్తులు వెంటనే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణ శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకొని.. మెరుగైన వైద్యం మండల కేంద్రంలో అందే విధంగా చర్యలు తీసుకోవాలని, సరైన వైద్యం అందాలంటే 100 పడకల ఆసుపత్రి కావాలని.. ప్రభుత్వం 24 గంటల వైద్యసేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని.. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

# దసరా నవరాత్రుల్లో ఆరవ రోజు పూజా కార్యక్రమం

**జయభేరి, ఘట్కేసర్ :**



దసరా నవరాత్రుల్లో భాగంగా మన కొరముల గ్రామంలో జై దుర్గా గణేష్ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి దసరా నవరాత్రుల్లో భాగంగా ఆరవ రోజు పూజా కార్యక్రమంలో భాగంగా అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా కొలువైనారు. ఈ నవరాత్రుల్లో భాగంగా శ్రీ దుర్గ గణేష్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జగదీష్ గౌడ్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ బిజెపి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఘట్కేసర్ మండల్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు రామోజీ, ఘట్కేసర్ బిజెపి అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, జిల్లా బీజేవైఎం అధ్యక్షులు పవన్న, ఎదులాబాద్ బిజెపి సీనియర్ నాయకులు గట్టుపల్లి మల్లేష్(ఈటెల మల్లేష్), చౌదర్గూడా బిజెపి మాజీ అధ్యక్షులు ఉదయ్ సన్నీ, ప్రతాప్ సింగారం బిజెపి అధ్యక్షులు శివాజీ, బూత్ అధ్యక్షులు రవీంద్రనాథ్, సీనియర్ నాయకులు ముఖేష్, జై దుర్గా గణేష్ కమిటీ, కొర్రముల గ్రామ ప్రజలు కూడా అన్నప్రసాద కార్యక్రమానికి హాజరు కావడం జరిగింది



# అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు

- ఆడబిడ్డలకి బతుకమ్మ చీరల పంపిణీ
- బతుకమ్మ ఆటపాటలతో హోరెత్తిన మహిళా ప్రభంజనం

**జయభేరి, జూబ్లీహిల్స్ :**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బతుకమ్మ సంబురాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీనగర్ కాలనీకి సంబంధించిన బతుకమ్మ వేడుకలు యూసఫ్ గూడ లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పూల వేడుకలో ఆడపడుచులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యువతులు, చిన్నారుల ఆటపాటలతో సందడి చేశారు. జూబ్లీహిల్స్ శాసనసభ్యులు, హైదరాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షులు స్వర్గీయ మాగంటి గోపీనాథ్ సతీమణి, జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి, ఎమ్మెల్సీ రమణ, మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్ లతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రపంచమంతా పూలతో దేవుడిని పూజిస్తే.. ఆ పూలనే దేవుడిగా పూజించే బతుకమ్మ పండగ రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుగుతుందన్నారు. బతుకమ్మ ఆడటానికి విచ్చేసిన మహిళలందరికీ బతుకమ్మ కానుకగా చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, స్థానిక నాయకులు, మహిళలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్ లో PJR ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**జయభేరి, ఉప్పల్**




ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్ లో తెల్కల సుజిత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన దాండియా ప్రోగ్రాంలో ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**జయభేరి, ఉప్పల్**

# అమ్మవారి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, ఉప్పల్:**

అమ్మవారి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఉప్పల్, రామంతపూర్, కాప్రా డివిజన్ లో అమ్మవారి మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలని వాసులు BRS పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు చీరలను పంపిణీ చేసిన కల్లూరి బ్రదర్స్




**జయభేరి, తుర్కపల్లి, సెప్టెంబర్ 27:**

తుర్కపల్లి మండలం వెంకటాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ కల్లూరి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో తమ సొంత ఖర్చులతో గ్రామ మహిళలందరికీ బతుకమ్మ పండుగ సందర్భంగా చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళలు ఆడబిడ్డలు అత్యంత వైభవంగా పువ్వులనే పూజిస్తూ జరుపుకునే అతిపెద్ద పండుగ బతుకమ్మ పండుగ అని, అలాంటి పండుగకు మహిళను గౌరవిస్తూ చీరలను పంపిణీ చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ శ్యామ్ రెడ్డి, కె వెంకట నరసింహారెడ్డి, అంజిరెడ్డి, కొండపాక వెంకట్, పాపయ్య, నార నరసింహులు, పల్లెపాటి అనిల్, కరుణాకర్, కరుణాకర్ రెడ్డి, బాలయ్య, వేముల లక్ష్మీనరసయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.



## పైడిమాంబ ఆలయ ప్రాంగణంలో అఖండ దీపారాధన

**జయభేరి, పరవాడ:**

మండల కేంద్రం పరవాడలో శ్రీ పైడిమాంబ ఆలయ ప్రాంగణంలో పైడిమాంబ వాకర్స్ మహిళల ఆధ్వర్యంలో శనివారం రాత్రి వైభవంగా అఖండ దీపారాధన కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు బాల త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చిన నేపథ్యంలో వాకర్స్ మహిళలు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముందుగా పైడిమాంబ అమ్మవారికి పూలమాలలను వేసి అనంతరం దీపారాధనలో భాగంగా ఓం, త్రిశూలం, స్వస్తిక్ ఆకారాలను దీపాల ప్రమిదలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వాకర్స్ మహిళలు దీపాలతో అలంకరించిన మూడు ఆకారాలు చూపులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం భవాని మాలధారకులు మరియు వాకర్స్ కుటుంబాలు సుమారు 100 మందికి అల్పాహారం టిఫిన్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పైడిమాంబ వాకర్స్ కుటుంబ సభ్యులు, భవాని భక్తులు పాలుపంచుకున్నారు.

## ఆర్థిక సహాయం అందించిన ఆటో యూనియన్ సభ్యులు



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం వెన్నలపాలెం గ్రామంలో ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందిన పువ్వకోడు రవీంద్ర హరిప్రసాద్ కు తన తోటి ఆటో యూనియన్ సభ్యులు అందరు కలిసి శనివారం జరిగిన పెద్దకర్మ కార్యక్రమంలో ఆ కుంటాబానికి పైడిమాంబ ఆటో యూనియన్ తరపు ఇరవే ఐదు వెలు రూపాయలు 1 రైస్ బ్యాగ్ వారు కుటుంబానికి యూనియన్ తరపు నుంచి ఇవ్వడం జరిగినది ఆయన ఆత్మ చేకూరాల భగవంతుడిని ప్రార్థిన చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో శ్రీ పైడిమాంబ ఆటో యూనియన్ సభ్యులు పాల్గొనడం జరిగినది.

## 79వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్



**జయభేరి, పరవాడ :**

జీవిఎంసీ పరిధిలో 79వ వార్డు దేశపాత్రునిపాలెం గ్రామంలో జరుగుతున్న 2.5 కోట్ల అభివృద్ధి పనులను 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ మరియు 79వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు పిల్లా శివకృష్ణ పరిశీంచారు. ఈ యొక్క కార్యక్రమంలో లక్కరాజు శ్రీనివాస్, జాజుల చిన్న, అమరపిన్ని గోపి, నాగిరెడ్డి వెంకట అప్పారావు, కరణం అప్పారావు, నున్న గొప్పలు జనార్దన్ రావు, లక్కరాజు వెంకటేష్, ఇల్లపు సాయికుమార్ మరియు జనసేన పార్టీ మరియు తెలుగుదేశం పార్టీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## దేవరకొండ ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం ఏకగ్రీవంగా ఎన్నికలు




**జయభేరి, దేవరకొండ :**

స్థానిక దేవరకొండ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం 2025 2028 మూడు సంవత్సరాల కాలమునకు ఎన్నికలు తేది 26.09.2025 శుక్రవారం నాడు సేవాసధనంలో జిల్లా నాయకులు జెల్ల శ్రీశైలం, ఆంజనేయులు, నూనె రంగయ్య, మోహనరావు, కంచర్ల నారాయణ రెడ్డి గారల సారథ్యంలో జరిగినవి. గత కమిటి అధ్యక్షులు తాడిశెట్టి నరసింహ, కార్యదర్శి అంకం చంద్రమౌళి, కోశాధికారి పంగనూరు లింగయ్య సహా అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్, పడమటి శాంతకుమారి, సహాయ కార్యదర్శి వనం బుచ్చయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, జిల్లా కౌన్సిలర్స్ తాడిశెట్టి సుదర్శన్, బొలుసాని సత్యనారాయణ గారలు ఏకగ్రీవముగా ఎన్నిక కాబడినట్లు జిల్లా నాయకులు ప్రకటించినారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ దేవరకొండ యూనిట్ చక్కటి కార్యక్రమాలు మరియు చక్కటి భవనము నిర్మించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమమైన సంఘంగా పేరుపొందినారు అన్నారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులను శాలవాలతో సత్కరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, సభ్యులు 100మంది పాలుగోన్నారు. నూతన కార్యవర్గమునకు జిల్లా, రాష్ట్ర, పాలుగొన్న సభ్యులు శుభాకాంక్షలు తెలియజేసినారు. అనంతరం కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగినది.

# అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా మంచి భవిష్యత్తు

- శామీర్ పేట్ మండలంలో ఐటిఐ కళాశాల ప్రారంభం
- జిల్లా కలెక్టర్ మను చౌదరి

**జయభేరి, మేడ్చల్ :**



ఎటిసి (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్) సెంటర్ల ద్వారా మీలోని నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని బయటికి తీసి మీకు మంచి భవిష్యత్తు ఇవ్వాలనే ఆలోచనతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, ఐటిఐ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు.

శనివారం శామీర్ పేట్ మండలంలో ఐటిఐ కాలేజీలో జిల్లా కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి ఎటిసి సెంటర్ ను ప్రారభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీలోని నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని బయటికి తీసేందుకు ఐటిఐ లను పునరుద్దరించి నిరుద్యోగయువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం ఎటిసి సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మారుతున్న టెక్నాలజీకనుగుణంగా మీరు ఆలోచించి ఆవిష్కరణలను రూపొందించాలని అన్నారు. మీరు నేర్చుకునే అంశం గురించి తప్పకుండా మీ తోటి వారితో చర్చించాలని తద్వారా అంశం పై పూర్తి అవగాహన కలుగుతుందన్నారు. మీలోని భయాన్ని విడిచి నలుగురిలో మాట్లాడేలా మిమ్మల్ని మీరు తీర్చి దిద్దుకోవలన్నారు.



అందువల్ల భవిష్యత్తులో ధైర్యంగా ఇంటర్వ్యూలలో సమాధానం ఇవ్వగలుగుతారని విద్యార్థులకు హితబోధ చేసారు. చాలా వరకు విద్యార్థులకు ఇంటర్వ్యూలలో థియరీ నాలెడ్జ్ ఉంటుంది కాని ప్రాక్టికల్ నాలెడ్జ్ లేకపోవడం ద్వారా ఉద్యోగాలు రావడం లేదని, ఈ సమస్యనధిగమించేందుకే ప్రభుత్వం ఎటిసి సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి నుండి మీరు థియరీ తోపాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించుకోవాలన్నారు. ఎన్ని విషయాలు తెలిసి ఉన్నప్పటికి వాటి గురించి బయటకి చెప్పగలిగినప్పుడే గుర్తింపు వస్తుందని అన్నారు. మీలోని సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఏదో ఉద్యోగం కోసం కాకుండా పదిమందికి ఉపాధి కల్పించే విధంగా పేద్దగా ఆలోచించాలని విద్యార్థులకు తెలిపారు. మీరు చదివే అంశాల గురించి ఎక్కువగా విశ్లేషణ చేస్తుంటే మీకు కొత్త కొత్త ఆలోచనలు వస్తుంటాయని వాటిలో ముఖ్యమైన అంశాల గురించి చర్చించాలని సూచించారు. ముందుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి కలెక్టర్ ఎటిసి సెంటర్లోని మిషనరీలకు పూజ చేసారు. అనంతరం కలెక్టర్ ఎటిసి సెంటర్లోని గదులను కలియ తిరిగి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి రాధిక, ఐటిఐ కాలేజీ ప్రిన్సిపల్ లలిత, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో అవినీతి అధికారి

- రూ. ఐదు లక్షలు తీసుకుంటూ పట్టుబడిన టీపీవో రాధాకృష్ణ

**జయభేరి, మేడ్చల్ :**



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎల్లంపేట్ పురపాలక సంఘంలో టౌన్ ప్లానింగ్ ఇంచార్జ్ గా విధులు నిర్వహిస్తున్న రాధాకృష్ణ రెడ్డి రూ. 3 లక్షల 50 వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. హైదరాబాద్ ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం ఎల్లంపేట్ పురపాలక సంఘం పరిధిలోని హెచ్ఎండీఏ అనుమతి ఉన్న గంగస్థాన్ వెంచర్ నిర్వహకులు తమ పరిధి మేరకు ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టి గేట్లు ఏర్పాటు చేశారు. అక్రమంగా ఏర్పాటు చేసిన గేట్లను కూల్చివేస్తానని టీపీవో రాధాకృష్ణ బెదిరించడంతో ఏసీబీని సంప్రదించారు. ఆయన రూ. 5 లక్షలు డిమాండ్ చేయడంతో వెంచర్ నిర్వహకులు ఒప్పందం కుదుర్చుకుని వారం రోజుల క్రితం రూ. లక్ష రూపాయలు అందించారు. ఈ మేరకు బాదితుడు అవినీతి శాఖ అధికారులను సంప్రదించాడు. దింతో సదరు అధికారి శనివారం ఇంటి దగ్గర డబ్బులు ఇవ్వాలని కోరడంతో కొంపల్లిలోని ఆయన ఇంటి దగ్గర ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఎల్లంపేట్ పురపాలక సంఘం కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రాధాకృష్ణ రెడ్డి ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యాలయానికి రావాలని కోరినట్లు తెలిపారు. కమీషనర్ ప్రమేయం ఉందా లేదా అనేది పూర్తి విచారణ చేపట్టిన అనంతరం వెల్లాడిస్తానని ఎసిబి అధికారులు తెలిపారు. బాదితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆయనను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినున్నట్లు తెలిపారు.



## దుర్గామాతకి కుంకుమ పూజలు



**జయభేరి, గార్ల, సెప్టెంబర్ 27:**

మహబూబాబాద్ జిల్లా, గార్ల మండల పరిధిలోని చిన్నకిష్టాపురం గ్రామంలో దుర్గా మాత అమ్మవారికి భవాని మాలదారులు, భక్తులు కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా భవాని మాలదారులు, భక్తులు మాట్లాడుతూ, గ్రామంలోని ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. దుర్గామాత సన్నిధిలో కుంకుమార్చన పూజను దుర్గాదేవికి నామాలను జపిస్తూ కుంకుమను సమర్పించే ఒక పవిత్రమైన ఆరాధన అని తెలిపారు. ఆస్వియుజ మాసంలో అమ్మవారు మహాశక్తి సంపన్నురాలుగా ఉండి ప్రజలకు ఉండే సమస్త జ్వర పీడన, శరీరంలో ఉండే ఉష్ణ సంబంధిత వ్యాధులను తగ్గిస్తారని తెలిపారు. ఈ మాసంలో అమ్మవారు పది రూపాల్లో దర్శనమిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భవాని మాలదారులు, భక్తులు బాదావత్ రవి, కోటేష్, సైదులు, బాలు, ప్రవీణ్, ఉమా భద్రు, బిచ్చు, చిన్న, గిరి, బావు సింగ్, రాందాస్, లక్ష్మణ్, వీరన్న, కిషన్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## మదర్ డెయిరీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం



**జయభేరి, నల్గొండ:**

ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల మదర్ డెయిరీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. ముగ్గురు బీఆర్ఎస్ అభ్యర్థుల ఘన విజయం సాధించారు. బీఆర్ఎస్ అభ్యర్థులు రచ్చ లక్ష్మీ నర్సింహారెడ్డికి 154 ఓట్లు, సందిల భాస్కర్ కు 240 ఓట్లు, కర్నాటి జయశ్రీకి 172 ఓట్లతో బీఆర్ఎస్ ఓట్లు వచ్చాయి.

# జెడ్ పిటిసి, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచుల రిజర్వేషన్ ఖరారు

**జయభేరి, తుర్కపల్లి, సెప్టెంబర్ 27:**




తుర్కపల్లి మండలం స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పిటిసి, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచుల రిజర్వేషన్లను అధికారులు ఖరారు చేశారు. జెడ్పిటిసి జనరల్ మహిళ, ఎంపీపీ జనరల్, 10 ఎంపీటీసీల లో తుర్కపల్లి ఎస్సీ జనరల్, వాసాలమర్రి ఎస్టీ జనరల్, మాదాపూర్ ఎస్టీ మహిళ, దత్తాయి పల్లి బిసి మహిళ, వీరారెడ్డి పల్లి బీసీ మహిళ, ములకలపల్లి బీసీ జనరల్ ,రుస్తాపూర్ బీసీ జనరల్, గంధ మల్ల జనరల్ మహిళ, ధర్మారం జనరల్, నాగాయపల్లి ఎస్టీ జనరల్ గా రిజర్వేషన్లను ప్రకటించారు .సర్పంచుల రిజర్వేషన్ వివరాలు మాదాపూర్ బీసీ జనరల్, చిన్న లక్ష్మాపురం బీసీ మహిళ ,దత్తాయి పల్లి ఎస్సీ మహిళ, మల్కాపూర్ ఎస్సీ జనరల్, పల్లె పహాడ్ ఎస్సీ మహిళ, తిరుమలపూర్ బిసి మహిళా, వెంకటాపూర్ బీసీ మహిళ, ఇందిరానగర్ బీసీ జనరల్, తుర్కపల్లి బీసీ జనరల్, రుస్తాపూర్ బీసీ జనరల్, వేల్పుపల్లి బిసి మహిళ, ధర్మారం జనరల్ మహిళ, గంధ మల్ల జనరల్, గొల్లగూడెం ఎస్టీ జనరల్, గోపాల్పురం జనరల్, కోణాపురం జనరల్ ,కొండాపురం జనరల్ మహిళ, నాగాయపల్లి జనరల్ ,వాసాలమర్రి జనరల్ మహిళ ,వీరారెడ్డిపల్లి జనరల్ మహిళ ,ఇబ్రహీంపూర్ బీసీ మహిళ, వెంకటాపూర్ బీసీ మహిళ, ము లకలపల్లి ఎస్టీ మహిళ గుజ్జవాని కుంట తండా ఎస్టీ మహిళ, రామోజీ నాయక్ తండా ఎస్టీ జనరల్ ,మోతీరామ్ తండా ఎస్టీ మహిళ, జెతిరామ్ తండా జనరల్, పెద్దతండ ఎస్టీ మహిళ, బద్దూ తాండా ఎస్టీ మహిళ, రాంపూర్ తండా బీసీ జనరల్ ,ఛోక్లా తండా ఎస్టీ జనరల్, బబులు నాయక్ తండ ఎస్టీ మహిళ ,బిలియా నాయక్ తండా ఎస్టీ జనరల్ గా అధికారులు రిజర్వేషన్లను ఖరారు చేశారు.

# పోరాటాలకు నడుంబిగించాలి

**జయభేరి, గార్ల, సెప్టెంబర్ 27:**




మనువాద, కుల హత్యలకు వ్యతిరేకంగా మహిళలు సమరశీల పోరాటాలకు నడుంబించాలని ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగా విజయ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్లో నిర్వహించిన పిఓడబ్ల్యు సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. దేశంలో మతోన్మాదం, కుల ఉన్మాదము జడలు విప్పి నాట్యమాడుతుందని అన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాలరాసి మనువాదాన్ని తీసుకురావడం కోసం ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడయాడే బిజెపి ప్రభుత్వం కుటీలత్వానికి పాల్పడుతుందని తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం మృగ్యమైందని అన్నారు. దేశంలో ఆర్ఎస్ఎస్ చెప్పిందే వేదంలా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. దేశంలో రాజ్య హింసకు వ్యతిరేకంగా పోరాడే మహిళలను పాలకులు బూటకపు ఎన్కౌంటర్ల పేరా హత్యలు చేస్తున్నారని అన్నారు. మహిళలకు ఆసుపత్రుల్లో, బస్సుల్లో, పోలీసు స్టేషన్లలో రక్షణ కరువైందని వాపోయారు. భక్తి పేరా, మతం పేరుతో, కులం పేరుతో, కులాల మధ్య వైరుధ్యం తెచ్చి అణచివేత కొనసాగిస్తున్నారని అన్నారు. కార్పొరేట్ శక్తుల మీద ఉన్న ప్రేమ, పేద ప్రజల మీద గాని, మహిళల మీద లేదని, మహిళలు మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, అసమానతలకు వ్యతిరేకంగా, హింస, వరకట్నం, హత్యలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పగిడి పాల తిరుపతమ్మ, ఊకే పద్మ, జడ ఐలమ్మ, తుడుం అనురాధ, భిన్నక్క, కవిత, శారద, రమ, మారుతీ, సుజాత, పిచ్చమ్మ, సత్యవతి, మౌనిక, భారతి, రాధ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ముట్టడికి తరలిన ట్రిబుల్ ఆర్ బాధితులు

- రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతాం
- సిపిఎం జిల్లా నాయకులు ఎన్. రాజు




**జయభేరి, షాద్ నగర్, సెప్టెంబర్ 27 :**

ట్రిబుల్ ఆర్ రోడ్ అలైన్మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి కలెక్టరేట్ కు షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట్ మండలం గ్రామస్తులు తొమ్మిది రేకుల, నిడద వెల్లి, ఫరూక్ నగర్ మండలంలోని భీమారం, అయ్యవారి పల్లి, ఉప్పరిగడ్డ తండా, కొందుర్గు మండలంలోని తంగేళ్లపల్లి, చెరుకుపల్లి, తుమ్మలపల్లి ,ట్రిబుల్ ఆర్ బాధిత రైతు కుటుంబాలు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు ధర్నాకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా నాయకులు రాజు మాట్లాడుతూ; కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అలైన్మెంట్ను ప్రకటిస్తూ రూట్ మ్యాప్ ఇస్తూ సర్వే నెంబర్లతో సహా ఇవ్వటం వలన ఆ సర్వే నెంబర్ లో ఉన్నటువంటి రైతులు అనేక తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ముఖ్యంగా ట్రిబుల్ ఆర్ అలైన్మెంట్ మ్యాపులో ఉన్నటువంటి భూముల పట్టాదారులు మొత్తం పేద రైతాంగం ఒక్కొక్కరికి రెండు ఎకరాలు మూడు ఎకరాలు ఉన్నటువంటి పేదలు మాత్రమే ఉన్నారు. పేద రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నటువంటి పరిస్థితి ఉన్నది. ట్రిబుల్ ఆర్ అలైన్మెంట్ ఒకచోట ఒకరకంగా ఇంకోచోట ఇంకోరకంగా ప్రకటిస్తూ ఇది కేవలం ఎక్కడ ప్రకటించిన భూముల రైతులు పేద రైతులు ఉన్నారు.

ఇది కేవలం పెట్టుబడుదారుల ప్రయోజనం కోసమే ఈ ట్రిబుల్ ఆర్ అలైన్మెంట్ను చేస్తున్నారని ఇది పేద రైతుల కోసం కాదని అందుకే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి నిత్యం వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నటువంటి మా పేద రైతుల పొట్ట కొట్టొద్దని రైతులు తీవ్రమైనటువంటి ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. దీని వలన పేద రైతులు మా భూములు పోవడం వల్ల మేము జీవించేది ఎట్లా బ్రతికేది అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ,రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆలోచించి పేద రైతులకు భూముల జోలికి రావద్దని పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం పేదల పొట్ట కొట్టొద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో 90% రైతులకు చిన్న సన్నకారు రైతులు ట్రిబుల్ ఆర్ అలైన్మెంట్లో తమ భూములను కోల్పోతున్నారన్నారు. కాబట్టి పాత అలైన్మెంట్ ప్రకారమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిచో రైతులను సమీకరించుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకూ ఈ పోరాటం కొనసాగుతుందని రైతుల పక్షాన పోరాడి సాధించేవరకు ఈ పోరాటాన్ని వదలమని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్, రాజు ,కురుమయ్య , వెంకటయ్య, రైతులు లక్ష్మయ్య ,నగేష్, శ్రీనివాస్, చంద్రకాంత్, రమేష్ ,రాంసింగ్ ,రాజు, రాంజీ నాయక్, రవి నాయక్ ,అమృనాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ధర్మ రెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**జయభేరి, డిండి :**

డిండి మండలం ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు మాజీ యాసాని ధర్మ రెడ్డి ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకున్నారు. శనివారం ఎర్రగుంటపల్లి గ్రామంలో యాసాని ధర్మ రెడ్డినీ బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన వెంట మాల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి,పేట వెంకటయ్య, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి




**జయభేరి, మేడ్చల్ :**

బహుభాషా కోవిదుడైన బాపూజీ జీవితం అందరికి ఆదర్శమని గుండ్లపోచంపల్లి మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయంలో అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాలలో మహిళ సిబ్బంది పాల్గొని ఆడి పాడారు. ఈ సందర్భంగా మేనేజర్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమానికి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అందించిన ప్రజాస్వామిక స్ఫూర్తి, చేసిన త్యాగం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ దుర్గాప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ చంద్ర మోహన్, సిబ్బంది మహిపాల్ రెడ్డి, భాస్కర్ గౌడ్, నర్సింహారెడ్డి, ప్రసాద్ గౌడ్, శేషిదర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, విజయ్, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

- అమ్మవారిని దర్శించుకున్న సినీ నటుడు సుమన్



**జయభేరి, మేడ్చల్ :**

దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గామాత ను ప్రముఖ సినీ నటుడు సుమన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సుమన్ ను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకుడు విక్రమ్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్, నాయకులు శ్రీనివాస్, సురేష్, రామారావు, అశోక్, నరేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టరేట్ లో బతుకమ్మ సంబరాలు



**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబరాలు. శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం తరపున జిల్లా వైద్య ఆరోగ్య, కో ఆపరేటివ్, పరిశ్రమలు, సమాచార శాఖల ఆధ్వర్యంలో అంబరాన్ని అంటే విధంగా బతకమ్మ సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, డిఎం అండ్ హెచ్ ఓ ఉమాగౌరీ, కో ఆపరేటివ్ అధికారి వెంకటరెడ్డి, సమాచార శాఖ అధికారులు నాగాంజలి, స్వర్ణలత సాంస్కృతిక కళాకారులు, మహిళ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పెత్తందారులపై పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ

- వీరనారి చాకలి ఐలమ్మ యూనివర్సిటీకి ఐలమ్మ పంచలోహలతో కూడిన ప్రతిమను బహుకరించిన ఐదారి శంకర్




**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్ కోటిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళ విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా పంచలోహ ఇతడి ప్రతిమను చాకలి ఐలమ్మ సంఘం ఫౌండర్ చైర్మన్ ఐదారి నాగిళ్ళ శంకర్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనంజయకి బహుకరించడం జరిగింది.ఈ సందర్భంగా ఐదారి శంకర్ మాట్లాడుతూ.. భూమికోసం, భుక్తికోసం, వెట్టి చాకిరి విముక్తికై, బానిసత్వానికి వ్యతిరేకంగా భూస్వామ్య, పెత్తందారులపై పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ పేరును కోటి ఉమెన్స్ కాలేజీకి పెట్టడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. శ్రామిక వర్గాల నుంచి వచ్చిన చాకలి ఐలమ్మ సమానత్వంకై దోపిడీ పీడనలకై చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు దానికి నిదర్శనం. ఈ వీరనారి చాకలి ఐలమ్మ మహిళ విశ్వవిద్యాలయమే అని అన్నారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సూర్య ధనంజయ్ ఐదారి శంకర్ కు శాలువా కాపీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కవి రచయిత సుద్దాల అశోక్ తేజ, తెలంగాణ చా.ఐ.స, కోఆర్డినేటర్లు కోలుకులపల్లి రాధిక, పగిళ్ళ సందీప్,ప్రధాన కార్యదర్శి ఐతరాజు లక్ష్మణ్, రచయిత మామిండ్ల రమేష్ రాజా, ఎన్ శంకర్ విశ్వవిద్యాలయ ప్రిన్సిపల్ ప్రొఫెసర్లు అసిస్టెంట్ ప్రొఫెసర్లు విద్యార్థినిలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఖతార్ లో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బతుకమ్మ వేడుకలు

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ జాగృతి ఖతార్ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా జరిగాయి. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరైయారు. ఈ కార్యక్రమానికి ఖతార్ తెలంగాణ వాసులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఖతార్ తెలంగాణ ఆడబిడ్డలతో కలిసి కల్వకుంట్ల కవిత ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. కవిత మాట్లాడుతూ తెలంగాణ బిడ్డలు బతుకుదెరువు కోసం బొగ్గుబాయి.. దుబాయికి పోయింద్రు అని చెప్పుకునేటోళ్లం. ఇక్కడికి వచ్చిన వారి కష్టాలు మాకు తెలుసు.. తల్లి దండ్రులు, కుటుంబాలను విడిచిపెట్టి ఇక్కడ క్యాంపులల్లో ఉంటూ మీకు వచ్చే జీతంలో ఎంతో కొంత మిగిల్చి ఇంటికి పంపుతరు. మీ మనసుల ఎంత దుఃఖం ఉంటదో తెలుసు.. ఆ దుఃఖం తీరాలని ప్రయత్నం చేస్తున్నాం.. త్వరలోనే మీరంతా తెలంగాణ కు వచ్చే మంచి రోజులు రావాలని, ఇక్కడే ఉన్నా బాగుండాలని కోరుకుంటున్నామని అన్నారు. ఏ పండుగ వచ్చినా అక్కడ ఉన్న మీ కుటుంబానికి మీరు గుర్తుకు వస్తారు. నా మనసుకు కష్టంగా, బాధగా ఉంది.. కానీ జీవితంలో కొన్ని సందర్భాలు వస్తయ్.. యుద్ధం చేయాల్సి వచ్చినప్పుడు మనోడైనా.. మందోడు అయినా న్యాయం, ధర్మం ఎటు ఉందో చూడాలే. మీరు మనసుల మనది ఏం పెట్టుకోకండి.. మా సంగతి ఎట్లున్నా తెలంగాణ ప్రజలు బాగుండటం, తెలంగాణ హక్కులను రక్షించడం.. తెలంగాణ ప్రజల కోసం కొట్లాడడమే ఊపిరిగా పని చేస్తామని అన్నారు.

## గుట్ట దేవస్థానంకు ఎక్సలెన్సీ అవార్డ్

- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రదానం



**జయభేరి, యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 27:**

అంతర్జాతీయ పర్యాటక దినోత్సవములలో భాగముగా తెలంగాణ టూరిజమ్ ఎక్సెలెన్స్ అవార్డ్ కు తొలి పుణ్యక్షేత్రముగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం ఎంపిక అయినది. శనివారము సా.గం 600లకు సంప్రదాయవేదిక శిల్పారామము లో తెలంగాణ ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కార్యనిర్వహణాధికారి జి.రవి, ఐ.ఎ.ఎస్., ఎఇఓలు జూశెట్టి కృష్ణ, గజవెల్లి రఘు ఈ అవార్డును అందుకొన్నారు. ఇట్టి అవార్డుకు ఈ క్షేత్రమునకు ఎంపిక చేసినందుకు తెలంగాణ టూరిజం శాఖ వారికి ధన్యవాదములు తెలుపుతూ, ఇట్టి అవార్డు రావడం ఎంతో ఆనందదాయకమని దేవస్థానం కార్యనిర్వహణాధికారి జి.రవి అన్నారు. యావత్ దేవస్థాన సిబ్బంది తమ సంతోషాన్ని వ్యక్తపరచారు.

## మేడ్చల్ ఏటీసీని ప్రారంభించిన జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా

**జయభేరి, మేడ్చల్ :**




మేడ్చల్ జిల్లా కేంద్రంలోని మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని మేడ్చల్ పట్టణ ప్రభుత్వ ఐ.టి.ఐ కళాశాల నందు అధునాతన సాంకేతిక కేంద్రం అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను వర్చువల్ గా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రారంభించారు. టాటా టెక్నాలజీస్ వారి ఆర్థిక సాయంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన 65 ఏటీసీలను ప్రారంభోత్సవం చేశారు. మేడ్చల్ ఐటిఐ లోని ఏటీసీని లాంఛనంగా మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా చేతుల మీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది.ఏటీసీలో ప్రారంభించిన ఆరు ట్రేడ్లకు సంబంధించిన మిషనరీల పనితీరును ఉపాధి అవకాశాల గురించి బోధన సిబ్బందితో అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా అడిగి తెలుసుకున్నారు. ఏటీసీ విద్యార్థుల నైపుణ్యాలను గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపల్ హనుమాన్ నాయక్, బిగేట్ వైస్ చైర్మన్ మనోహర్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్ రెడ్డి, ఎంఆర్ఓ భూపాల్, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుర్గం శివ శంకర్ ముదిరాజ్, మేడ్చల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, కొడే మహేష్ కురుమ, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉదండపురం సత్యనారామణ, మేడ్చల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగరాజు గౌడ్, మేడ్చల్ పట్టణ మాజీ యం పి టి సి సభ్యులు నడికొప్పు బాల మల్లేష్ ముదిరాజ్, బర్ల సంతోష్ ముదిరాజ్, నాగేష్ అధికారులు, అనధికారులు, పుర ప్రముఖులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఐటిఐ కళాశాల సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇండియా లో స్వదేశీ 4జీ సేవలు


**జయభేరి, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27:**




ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న స్వదేశీ 4జీ సేవలను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చింది. శనివారం ఒడిశాలోని ఝార్సుగూడలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. పూర్తి భారతీయ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ 'భారత్ టెలికాం స్టాక్' నెట్‌వర్క్‌ను జాతికి అంకితం చేశారు. ఈ చారిత్రాత్మక ఘట్టం ద్వారా టెలికాం రంగంలో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం దిశగా దేశం ఒక కీలక మైలురాయిని అధిగమించింది.ఈ కార్యక్రమంలో భాగంగా, సుమారు రూ.37,000 కోట్ల వ్యయంతో, సౌర శక్తితో పనిచేసే 97,500 మొబైల్ 4జీ టవర్లను ప్రధాని మోదీ ప్రారంభించారు. దేశంలోని ప్రతి గ్రామానికి 4జీ సేవలు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన '100 శాతం 4జీ సాచురేషన్ ప్రాజెక్టు'కు కూడా ఆయన శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఒడిశాలోని 2,472 గ్రామాలతో సహా దేశవ్యాప్తంగా సరిహద్దు, మారుమూల, తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లోని 26,700కు పైగా గ్రామాలకు తొలిసారిగా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో సుమారు 2.2 కోట్ల మంది పౌరులకు ప్రయోజనం చేకూరనుంది.ఈ స్వదేశీ 4జీ నెట్‌వర్క్ రూపకల్పనలో బీఎస్ఎన్ఎల్‌తో పాటు దేశీయ టెక్ దిగ్గజాలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సీడాట్), తేజస్ నెట్‌వర్క్స్ లిమిటెడ్ కీలక పాత్ర పోషించాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా టీసీఎస్ డేటా సెంటర్ల ఏర్పాటు, నెట్‌వర్క్ నిర్వహణ వంటి బాధ్యతలను నిర్వర్తించగా, సీడాట్ కోర్ అప్లికేషన్‌ను, తేజస్ నెట్‌వర్క్స్ బేస్ స్టేషన్లు, రేడియో పరికరాలను అందించాయి. లక్షకు పైగా సైట్లలో ఈ స్వదేశీ పరికరాలను విజయవంతంగా నెలకొల్పారు. ఈ నెట్‌వర్క్ పూర్తిగా క్లౌడ్ ఆధారితమైనది కావడంతో, భవిష్యత్తులో సులభంగా 5జీకి అప్‌గ్రేడ్ చేసేందుకు వీలుంటుందని అధికారులు తెలిపారు.ఈ విజయంతో, సొంతంగా 4జీ, ఆపై టెక్నాలజీలను అభివృద్ధి చేసిన డెన్మార్క్, స్వీడన్, దక్షిణ కొరియా, చైనా వంటి అతికొద్ది దేశాల సరసన భారత్ నిలిచింది. టెలికాం పరికరాల కోసం విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించి, జాతీయ భద్రతను బలోపేతం చేయడంలో ఇది కీలక ముందడుగు అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### గ్రామీణ భారత్‌కు డిజిటల్ వరం


ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ సీఎండీ రాబర్ట్ జె. రవి మాట్లాడుతూ, "ఇది జాతి గర్వించదగ్గ చారిత్రాత్మక విజయం. టీసీఎస్, తేజస్ నెట్‌వర్క్స్, సీడాట్ భాగస్వామ్యంతో నిర్మించిన మా స్వదేశీ 4జీ నెట్‌వర్క్, ఆత్మనిర్భర్ భారత్ నినాదానికి నిలువుటద్దం" అని అన్నారు. టీసీఎస్ సలహాదారు, తేజస్ నెట్‌వర్క్స్ చైర్మన్ ఎన్. గణపతి సుబ్రమణియం మాట్లాడుతూ, "సొంతంగా టెలికాం టెక్నాలజీని అభివృద్ధి చేసిన అతికొద్ది దేశాల సరసన భారత్‌ను నిలబెట్టడం మాకు గర్వకారణం. బీఎస్ఎన్ఎల్‌లో ఈ నెట్‌వర్క్‌ను విజయవంతంగా వ్యవస్థీకృతం చేయడం దేశంలోని ప్రతి మూలకు శక్తివంతమైన డేటా, వాయిస్ నెట్‌వర్క్‌ను తీసుకెళ్లడంలో చరిత్రాత్మకమైనది" అని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విద్య, స్మార్ట్ వ్యవసాయ పద్ధతులు, 24 గంటల టెలిమెడిసిన్ వంటి సేవలు అందుబాటులోకి రావడానికి ఈ నెట్‌వర్క్ దోహదపడుతుంది. ప్రధాని మోదీ కలలు కన్న 'డిజిటల్ ఇండియా' లక్ష్య సాధనలో ఈ స్వదేశీ 4జీ నెట్‌వర్క్ ఒక మైలురాయిగా నిలిచిపోతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు



# ది ప్యారడైజ్' నుంచి శికంజ మాలిక్ గా కలెక్షన్ కింగ్ మోహన్ బాబు

ది ప్యారడైజ్ మోస్ట్ ఎవైటెడ్ చిత్రాలలో ఒకటి, ప్రతి అప్‌డేట్ ఈ సినిమా కోసం ఎక్సయిట్మెంట్ పెంచుతుంది. ఈ చిత్రం ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. నేచురల్ స్టార్ నాని 'జడల్' గా కనిపించడం సంచలనం సృష్టిస్తోంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రంలోని ప్రతి అంశాన్ని చాలా జాగ్రత్తగా రూపొందిస్తున్నారు. ఈ రోజు మేకర్స్ వెటరన్ స్టార్ మోహన్ బాబు 'శికంజ మాలిక్' గా ది ప్యారడైజ్ లో పవర్ ఫుల్ విలన్ పాత్రను పోషిస్తున్నారని అనౌన్స్ చేశారు. ఇది సినిమాపై బజ్ ని మరింతగా పెంచుతుంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల చాలా కాలం తర్వాత లెజెండరీ మోహన్ బాబును బిగ్ స్క్రీన్ పైకి తీసుకువస్తున్నారు. పవర్ ఫుల్ విలన్ గా చూపిస్తున్నారు. ఈ పాత్ర విన్న వెంటనే మోహన్‌బాబు గారిని అద్భుతంగా ఆకట్టుకుంది, వెంటనే అంగీకరించారు. తన కోసం రాసిన పాత్ర విన్న తర్వాత దర్శకుడు శ్రీకాంత్ అభిమానిగా మారిపోయారు. మోహన్‌బాబు ఐకానిక్ చారిస్మాను అద్భుతంగా ప్రజెంట్ చేస్తూ రెండు పవర్ లుక్స్ రిలీజ్ చేశారు మేకర్స్. షర్ట్ లేకుండా గన్, కత్తి పట్టుకుని సిగార్ కాలుస్తూ రగ్గడ్ అండ్ ఇంటెన్స్ లుక్ అదిరిపోయింది. మరో లుక్ లో రెట్రో అవతార్ లో సిగార్ కాలుస్తూ భుజంమీద గన్ పెట్టుకొని స్వాగ్ తో నడుచుకుంటూ వస్తున్నట్లు ప్రజంట్ చేసి లుక్ మైండ్ బ్లోయింగ్ గా వుంది. ఈ రెండు లుక్స్ అద్భుతమైన రెస్పాన్స్ తో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పవర్, ఇంటెన్సిటీ, స్టైల్‌తో క్రాఫ్ట్ చేసిన ఈ పాత్రలో మోహన్‌బాబు గారి ప్రత్యేకతైన పంచ్ డైలాగ్స్, మానరిజమ్స్ ఫ్యాన్స్‌కి పండగలా ఉండబోతున్నాయి. 'డైలాగ్ కింగ్' ఇమేజ్‌కు తగిన విధంగా ఆయన మెస్మరైజ్ చేయబోతున్నారు. ఎస్ఎల్‌వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాక స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా 2026 మార్చి 26న తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో విడుదల కానుంది. ది ప్యారడైజ్ ఇండియన్ సినిమాని ప్రపంచవ్యాప్తంగా సెలబ్రేట్ చేసుకునే పాన్‌వరల్డ్ స్పెక్టకిల్‌గా నిలవనుంది. తారాగణం: నాని, మోహన్ బాబు, రాఘవ్ జుయల్

# 'దేవర' సీక్వెల్‌కు సన్నద్ధం



ఎన్టీఆర్ 'దేవర' చిత్రం గత ఏడాది సెప్టెంబర్ 27న విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో దేవర, వర పాత్రల్లో ఎన్టీఆర్ శక్తివంతమైన నటన అందరిని మెప్పించింది. సినిమా విడుదలై ఏడాది పూర్తయిన సందర్భంగా..దీనికి సీక్వెల్‌గా 'దేవర 2'ను తెరకెక్కించబోతున్నట్లు శనివారం నిర్మాణ సంస్థ సోషల్‌మీడియాలో ఓ ప్రకటన విడుదల చేసింది. 'దేవర' తుఫాను సముద్రతీరాల్ని తాకి విధ్వంసాన్ని సృష్టించి నేటితో ఏడాది పూర్తయింది.

# కుర్రాళ్లకు చెమటల్లు పట్టిస్తున్న భామ..



సినిమా ఇండస్ట్రీలో చాలా మంది చైల్డ్ ఆర్టిస్‌ట్‌లుగా కెరీర్ మొదలు పెట్టి ఆ తర్వాత హీరోలుగా, హీరోయిన్స్ గా కెరీర్ మొదలు పెట్టారు. స్టార్ హీరోల సినిమాల్లో ఎంతో మంది నటీనటులు చైల్డ్ ఆర్టిస్ట్ లుగా నటించి అలరించారు. ఇక వరుస చిత్రాల్లో చైల్డ్ ఆర్టిస్టులుగా నటించి తమకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కట్ చేస్తే ఇప్పుడు హీరోహీరోయిన్లుగా వెండితెరపై సత్తా చాటుతున్నారు. ఇప్పటికే తెలుగులో తేజా సజ్జా.. హీరోగా మారి ఆతర్వాత హనుమాన్ సినిమాతో స్టార్ డమ్ అందుకున్నాడు. అటు సంతోష్ శోభన్, సంగీత్ శోభన్, శ్రీవిధ్య, కావ్య కళ్యాణ్ రామ్, అనిక సురేంద్రన్, ఎస్తేర్ అనిల్.. ఇలా చాలా మంది చిన్నప్పుడు తమ నటనతో ఆకట్టుకుని.. ఇప్పుడు వెండితెరపై మెయిన్ లీడ్స్ పోషిస్తున్నారు. ఆమె ఇప్పుడు టాలీవుడ్‌లో క్రేజీ హీరోయిన్.. ఇప్పుడు ఏకంగా స్టార్ హీరోల సినిమాల్లో నటిస్తుంది. అప్పుడు చైల్డ్ ఆర్టిస్ట్ ఇప్పుడు హాట్ నెస్ కు కేరాఫ్ అడ్రస్ గా మారిపోయింది. అనుష్క శెట్టి హీరోగా నటించిన పంచాక్షరీ అనే సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్ గా నటించింది ఆ ముద్దుగుమ్మ. ఆమె మరెవరో కాదు యంగ్ బ్యూటీ రమ్య పసుపులేటి. హుషారు సినిమాతో హీరోయిన్ గా పరిచయమైంది ఈ చిన్నది. ఆ తర్వాత హీరోయిన్ గా ఒకటి రెండు సినిమాలు చేసింది. ఇక ఇప్పుడు ఈ చిన్నది మెగాస్టార్ చిరంజీవి సినిమాలో నటిస్తుంది. విశ్వంభర సినిమాలో చిరంజీవి చెల్లెలిగా నటిస్తుంది. అలాగే సోషల్ మీడియాలో ఈ ముద్దుగుమ్మ చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా హాట్ హాట్ ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఈ ముద్దుగుమ్మ షేర్ చేసే ఫోటోలకు కుర్రాళ్లు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.



# చిన్న గ్యాప్ ఇచ్చింది..

టాలీవుడ్ లో ఎంతో మంది కుర్ర హీరోఅఇప్పుడు ప్రస్తుతం దక్షిణాదిలోని క్రేజీ హీరోయిన్లలో ఆమె ఒకరు. ఒక్క సినిమాతోనే విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. తెలుగు, తమిళం, మలయాళం భాషలలో వరుస సినిమాల్లో నటించింది. అయితే తెలుగులో ఈ బ్యూటీకి అనుకున్నంత క్రేజ్ వచ్చినా.. ఆశించిన స్థాయిలో ఆపర్స్ మాత్రం రాలేదు ఆమె సంయుక్తమీనన్. గోల్డెన్ బ్యూటీగా ఇండస్ట్రీలో స్టార్ డమ్ సంపాదించుకుంది సంయుక్తా మీనన్.. అయినా టాలీవుడ్ మాత్రం పట్టించుకోలేదు. దీంతో సంవత్సరంపాటు తెలుగులో ఒక్క సినిమా చేయలేదు. కానీ ఇప్పుడు ఆమె చేతిలో ఏకంగా 8 సినిమాలు ఉన్నాయి. 2016 నుంచి మలయాళంలో పలు చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ఓ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. పవన్ కళ్యాణ్, రానా కలిసి నటించిన భీమ్లా నాయక్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత బింబిసార, సార్, విరూపాక్ష చిత్రాలతో వరుస హిట్స్ అందుకుంది. ఇప్పటివరకు ఆమె నటించిన చిత్రాలన్ని బాక్సాఫీస్ వద్ద విజయం సాధించాయి. దీంతో ఈ అమ్మడిని గోల్డెన్ బ్యూటీ అన్నారు. కానీ వరుస హిట్స్ అందుకున్నప్పటికీ ఈ బ్యూటీకి ఆశించిన స్థాయిలో ఆఫర్స్ మాత్రం రాలేదు. 2023లో ఆమె హీరోయిన్ గా చేసిన డెవిల్ మూవీ అంతగా ఆకట్టుకోలేదు. ఆ తర్వాత మరో సినిమా అనౌన్స్ చేయలేదు. చాలా కాలంగా మరో సినిమా చేయకుండా సైలెంట్ అయిన ఈ బ్యూటీ ఇప్పుడు 8 సినిమాల్లో నటిస్తుంది. బాలకృష్ణతో అఖండ 2, పూరీ, విజయ్ సేతుపతి కాంబో, శర్వానంద్ జోడిగా నారీ నారీ నడుమ మురారీ, బెల్లంకొండ శ్రీనివాస్ తో హైందవ, నిఖిల్ జోడిగా స్వయంభు, లారెన్స్ బెంజ్, హిందీలో మహారాణి చిత్రాల్లో నటిస్తుంది.

# మీకు కావాల్సినంత ఎంటర్ టైన్ మెంట్ ఇస్తామని ప్రామిస్ చేస్తున్నా..



సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా "Kర్యాంప్". ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద రైజింగ్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. "Kర్యాంప్" సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ సినిమా ర్యాంప్ మీట్ ప్రెస్ మీట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ యుక్తి తరేజా మాట్లాడుతూ.. కె ర్యాంప్ మూవీలో నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ చిత్రంలో కిరణ్ తో కలిసి నటించడం హ్యాపీగా ఉంది. అతను నా బెస్ట్ కో స్టార్ అని చెబుతాను. క మూవీతో కిరణ్ కమ్ బ్యాక్ ఇచ్చారు. కె ర్యాంప్ తో ఆ సక్సెస్ కంటిన్యూ చేయబోతున్నారు. ఈ సినిమాలో చాలా మంచి రోల్ ఇచ్చిన డైరెక్టర్ నానికి, ప్రొడ్యూసర్ రాజేశ్ కి థ్యాంక్స్. చేతన్ సూపర్బ్ మ్యూజిక్ ఇచ్చాడు. నా మొదటి సినిమా నుంచి సపోర్ట్ చేస్తూ వస్తున్న మీడియా మిత్రులకు థ్యాంక్స్. అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. కె ర్యాంప్ మూవీని మేమంతా చూశాం. సినిమా చూస్తూ అన్ని ఎజ్ గ్రూప్స్ వాళ్లం చాలా ఎంజాయ్ చేశాం. సినిమా సక్సెస్ మీద కాన్ఫిడెంట్ గా ఉన్నాం. ఈ దీపావళికి థియేటర్స్ కు వచ్చే అన్ని వర్గాల ప్రేక్షకులను కె ర్యాంప్ ఎంటర్ టైన్ చేస్తుంది. యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ ఇది. మా టీమ్ అంతా బాగా సపోర్ట్ చేశారు. వారి సపోర్ట్ వల్లే సెట్స్ లో ఎంతో కంఫర్ట్ గా షూటింగ్ చేశాం. కథలో ఉన్న ఫన్ ను సెట్స్ లోనూ ఫీల్ అయ్యాం. మళ్లీ కాలేజ్ కు వెళ్లిన వైబ్ కలిగింది. నాతో ఈ మూవీ చేసిన ప్రొడ్యూసర్స్, రాజేశ్, శివ గారికి థ్యాంక్స్. హీరోయిన్ యుక్తికి హీరోతో ఈక్వల్ ఇంపార్టెన్స్ ఉన్న క్యారెక్టర్ ఉంది. తన పర్ ఫార్మెన్స్ మీ అందరినీ ఆకట్టుకుంటుంది. ఈ మూవీలో నేను చిల్లరగా ఉంటా, యుక్తి క్యారెక్టర్ పిచ్చిది. వీళ్లిద్దరు కలిస్తే ఎంత ఫన్ క్రియేట్ అవుతుందో థియేటర్స్ లో చూస్తారు. ప్రమోషనల్ కంటెంట్ లో ఇప్పటికే మీరు చూసి ఉంటారు. ఇలాంటి పిచ్చి గర్ల్ ఫ్రెండ్ ఉంటే మీకు కూడా బూతులు వస్తాయి. మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ తో నా మూడో చిత్రమిది. ఎస్ఆర్ కల్యాణమండపం, వినరో భాగ్యము విష్ణు కథ తర్వాత కె ర్యాంప్ చేస్తున్నాడు. ఆర్ఆర్ తో మూవీ చూశాక చాలా హ్యాపీగా ఫీలయ్యా. నరేష్, సాయి కుమార్..ఇలా మా ఆర్టిస్టులంతా సెట్ లోకి రాగానే ఒక సూపర్ హిట్ మూవీకి వర్క్ చేస్తున్నామనే ఫీల్ తో షూటింగ్ చేశాం. నరేష్ ఎనర్జిటిక్ గా పర్ ఫార్మ్ చేశారు. మా జైన్స్ నాని మహేశ్ ఫ్యాన్, నేను పవన్ కల్యాణ్ ఫ్యాన్. ఈ ఇద్దరు ఫ్యాన్స్ మధ్య ఉండే వార్ చాలా స్పెషల్. ఈ జర్నీలో నాని నాకొక బ్రదర్ అయ్యాడు. అతన్ని చూస్తేనే నవ్వొస్తుంది. కంప్లీట్ ఎంటర్ టైన్ మెంట్ తో మూవీ చేసి ఒక వైబ్ క్రియేట్ చేయాలి అనుకున్నాం. అలాగే సినిమా చేశాం. ఈ చిత్రంలో కుమార్ క్యారెక్టర్ ప్లే చేసేప్పుడు చాలా ఎంజాయ్ చేశాను. ఒకట్రెండు డైలాగ్స్ చూసి సినిమాపై అభిప్రాయానికి రాకండి. నా మూవీ ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఉంటుంది అది నా గ్యారెంటీ. ఎక్కడా ఇబ్బంది పడరు. డబ్బున్న కుర్రాడు జాలీ లైఫ్ గడపాలని అనుకుంటాడు. ఒక క్రేజ్ క్రియేట్ చేసేందుకే ఆ ఎలిమెంట్ ను ప్రమోట్ చేస్తున్నాం. పండుగ నాలుగు రోజులు వస్తుంది. ఫ్యామిలీతో కలిసి చూసి కె ర్యాంప్ మూవీని ఎంజాయ్ చేస్తారు. నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి, వెంకీ, రెడీ..ఇలాంటి ఎంటర్ టైనర్స్ లా మా కె ర్యాంప్ చిత్రాన్ని రిపీటెడ్ గా చూడాలని అనుకుంటారు. గత దీపావళికి అన్ని సినిమాలు హిట్ అయ్యాయి. ఈ సారి మా కె ర్యాంప్ మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. ఈ చిత్రంతో మీకు కావాల్సినంత ఎంటర్ టైన్ మెంట్ దక్కుతుంది. నేను మాటిస్తున్నా అన్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**